

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 28 సంచిక : 6 ఫిబ్రవరి 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

శ్రీమద్భగవద్గీత ................................................ 22

అక్షరమణమాల ................................................ 24


మహేంద్రనాథ్ గుప్త ................................................ 26

మాస్టర్ మహాశయుడి భక్తి విశ్వాసాలు ...................... 28

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



మీరు ఎంత డబ్బు సంపాదించినా అది మీ కూడా రాదు. పైగా మీ కుటుంబములో కలహాలకు ఆ డబ్బే కారణం అవుతుంది. మీరు ఒక మంచి గుణం సంపాదించుకుంటే రాబోయే జన్మలలో ఆ మంచి గుణం మీ కూడా వస్తుంది. మీకు జ్ఞానం కలగటానికి ఆ గుణం మీకు సహకరిస్తుంది.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 19 జూన్ 1988, విస్సాకోడేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా! ఒక కార్యం నిమిత్తం కైలాసం నుంచి వచ్చిన స్వామే రమణస్వామి. ఆయన ఈ లోకంలో మరుగున పడిపోయినటువంటి జ్ఞానమార్గాన్ని, విచారణ మార్గాన్ని పునరుద్ధరణ చెయ్యటం కోసం ఆ లోకం లోంచి వచ్చినటువంటి దివ్యపురుషుడు, అవతారపురుషుడు, కారణజన్ముడు. జ్ఞానం సంపాదించాలి అని, జ్ఞానం లేకపోతే మోక్షం లేదని, జ్ఞానం వల్ల మాత్రమే మోక్షం వస్తుంది అని, పూర్వపు మహాత్ములు అందరూ చెబుతున్నప్పటికీ ఆ జ్ఞానమార్గాన్ని ఎత్తి చూపించటం కోసం వచ్చిన స్వామే రమణస్వామి. మనకి జీవితంలో అనేక పనులు ఉండవచ్చు. సంసారులకి కుటుంబ పోషణ, బ్రహ్మచారులకి చదువుకునే పని, ఇంకా సన్యాసులకి ధర్మ ప్రచారం ఇలా మనకి అనేక కార్యక్రమాలు ఉండవచ్చు. ఈ లోకంలోకి వచ్చినందుకు ఎవరి పని వారు చేయవలసి ఉంది. అహంకారం లేకుండా, కర్తృత్వం లేకుండా వచ్చిన పని జాగ్రత్తగా చేసుకుని మనం ఈ లోకం నుండి బయటకు వెళ్ళాలి.

అహంకారం లేకుండా జీవిస్తే, కర్తృత్వం లేకుండా జీవిస్తే మనం దుఃఖానికి దూరం అవుతాం, దుఃఖం నశించిపోతుంది. మన దుఃఖానికి కారణం ఏమిటి అంటే కేవలం కర్తృత్వం వల్ల, ఇది నేను చేస్తున్నాను అనే భావన వల్ల, అహంకారం వల్ల మనకి దుఃఖం కలుగుతుంది. అందుచేత మనం ఏ లోకంలో ఉన్నప్పటికీ ప్రస్తుతం భూలోకంలో ఉన్నాం, తర్వాత ఇంకో లోకంలోకి వెళ్ళొచ్చు, ఏ లోకంలోకి మనం వెళ్ళినప్పటికీ ముందు మన స్వరూపం అయిన ఆత్మని మనం దర్శనం చేసుకోవాలి. పరమాత్మ దర్శనం అయ్యే వరకు మనలని దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. అయితే ఈ దుఃఖం ఎలా ఉంది? మనకి శరీరం ఎలా ఉందో అలాగే మనకి మనసు ఒకటి ఉంది. ఈ మనస్సు వల్లే మనకి దుఃఖం కలుగుతుంది. మనసు లేకపోతే దుఃఖం లేదు అందుచేత ఈ మనసుని నాశనం చేయాలి. ఎందుచేత? మన దుఃఖానికి ఈ మనస్సే కారణం. అందుచేత మనం అభివృద్ధిలోకి రావాలి అంటే మన మనసుని జాగ్రత్తగా మనం అదుపు చేసుకోవాలి. మనలని అభివృద్ధిలోకి తీసుకువచ్చేది మన మనస్సే, మనలని పాడుచేసేది మన మనస్సే. మన మనస్సు కనుక మన స్వాధీనంలో ఉంటే, మన మనస్సు కనుక మన అదుపులో ఉంటే మన బంధువులు మన స్నేహితులు ఎవరు చేయలేని ఉపకారం మన మనసు మనకి చేస్తుంది. మన

మనసు కనుక మనకి వ్యతిరేకంగా ఉంటే, మన మనసు కనుక మనకి స్వాధీనంలో లేకపోతే మనకి ఎంతమంది ఉపకారం చేద్దాం అనుకున్నా అది అపకారం చేస్తుంది, ఎంత అపకారం చేస్తుంది అంటే ఎవరైనా ఉపకారం చేద్దాం అనుకున్నా మనకి చేయలేరు. ఒకవేళ చేసినా రాణించదు. కొంతమంది ఎంతో పెట్టాం రాణింపు లేదు అంటూ ఉంటారు. అదే విధంగా ఆధ్యాత్మికంగా అవ్వనివ్వండి, భౌతికంగా అవ్వనివ్వండి ఏ రంగంలో అయినా ఎదుటి వారు ఎంత చేసినప్పటికీ, మన మనస్సు మన స్వాధీనంలో లేకపోతే, మన మనస్సు మన అధీనంలో లేకపోతే దానికి రాణింపు ఉండదు.

అందుచేత ఈ మనసుని మనం బాగు చేసుకోవాలి. ఎవరి మనసుని వారు ప్రయత్నం చేసి బాగు చేసుకోవాలి. మనం ప్రయత్నం చెయ్యాలి, కాలం కలిసి రావాలి, భగవంతుడు యొక్క కటాక్షం ఉండాలి. ఇన్ని ఉంటే మనకి పని పూర్తి అవుతుంది. ఏ పని అయినా అవ్వాలి అంటే మనకి ఈ మూడు ఉండాలి. ఏ పుస్తకం చదివినా, ఏ మహాత్ముడు చెప్పినా మనసుని స్వాధీనం చేసుకోమనే చెబుతున్నారు. దానికి ఏమైనా రూపం ఉంటే మనం ఆ గెడకి కట్టేయవచ్చు. దానికి ఏమి రూపం లేదు. గెడకో, స్తంభానికో దానిని కట్టేయలేము. ఈ మనస్సే మన కూడా ప్రయాణం చేస్తుంది. ఈ మనసుని మనం బాగు చేసుకోవాలి. మనకు ఈ శరీరం పడిపోయిన తరువాత కూడా, తరువాత జన్మకి వెళ్ళిన తరువాత కూడా ఈ మనసు మటుకు ఏమి మారదు. మన శరీరం మారిపోయినప్పటికీ, ఈ మనస్సే మన కూడా ప్రయాణం చేస్తూ ఉంటుంది. అందుచేత మీరు అనేక సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారు. మీ కుటుంబ సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారు. మీ గ్రామ సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారు. అనేకమంది అనేక సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నారు. కాని ఈ మనసు అనే సమస్యని మనం పరిష్కారం చేసుకోలేక పోతున్నాం. నా మనస్సు అనే సమస్యని నేను పరిష్కారం చేసుకోలేకపోతున్నాను. మీ మనసుని మీరు పరిష్కారం చేసుకోలేకపోతున్నారు. ఎవరికైతే ఈ మనసు సహజంగా హృదయగతం అయ్యిందో, అంటే పరమాత్మ వైపుకి తిరిగిందో, దాని స్వస్థానం అయినటువంటి పరమేశ్వరుడిలో ఎవడికైతే ఈ మనసు కరిగిందో, అలా కరిగేలా ప్రయత్నం చేసుకోవటమే యోగం.

యోగం అంటే భక్తి యోగం, జ్ఞాన యోగం, ధ్యాన యోగం, కర్మ యోగం, అంటే యోగం ద్వారా మనసుని దాని స్వరూపం అయిన, దాని మూలం అయిన భగవంతుడిలో, ఆత్మలో ఈ మనసు లయం అయేటట్టు చెయ్యటమే యోగం. అది భక్తి ద్వారా చెయ్యండి,

నిష్కామ కర్మ ద్వారా చెయ్యండి, ధ్యానం ద్వారా చెయ్యండి, జపం ద్వారా చెయ్యండి, ఎవరు ఏమి చేసినప్పటికీ తన స్వస్థానం అయినటువంటి దాని మూలంలో ఈ మనసుని తీసుకెళ్ళి నిలబెట్టాలి, భగవంతుడిలో నిలబెట్టాలి, అదే యోగం. అటువంటి విషయాలు చెప్పకోవటానికే మనం ఇటువంటి ప్రయత్నాలు అన్నీ చేసుకుంటున్నాం. అంటే మంచి వాళ్ళ తోటి సహవాసం చెయ్యటం, మంచి గ్రంధాలు చదవటం, పెద్దల తోటి సహవాసం చెయ్యటం, ఎప్పడైనా దేవాలయానికి వెళ్ళి రావటం, మీకు తోస్తే మంచి సత్కర్మలు చెయ్యటం. ఈ పనులు అన్నీ ఎందుకు? ఎవరి కోసం చెయ్యాలి? మీ కీర్తి కోసమా? గొప్పల కోసమా? కాదు, మీ మనసుని బాగు చేసుకోవటం కోసం. ఎందుచేత అంటే మన మనసు అంత తేలికగా అంతర్ముఖం అవ్వదు. అది బహిర్ముఖం అవుతూనే ఉంటుంది. అది స్థూలంగా ఉంటుంది. అందుచేత పెద్దల యొక్క సహవాసం చెయ్యటం వల్ల, మంచి మంచి గ్రంధాలు చదవటం వల్ల, ఏదైనా పుణ్య క్షేత్రాలు అవకాశం ఉంటే చూడటం వల్ల, ఆత్మ గురించి ఇటువంటి సమావేశాలలో శ్రవణం చెయ్యటం వల్ల, ఇలా వినగా వినగా మనసుకి పొగరుబోతుతనం తగ్గుతుంది. మనసుకి ఆవేశం వస్తున్నంతకాలం, మనసుకి పొగరుబోతుతనం వస్తున్నంతకాలం మీ మనసు అంతర్ముఖం అవ్వదు. భగవంతుడిని తెలుసుకోమని చెప్పినా అది వినదు. మనం చెప్పిన మాట అది వినదు.

ఎందుచేత అంటే, మనం అందరం పెద్ద పాలేరులం. మన మనసుకే మనం జీవితం పొడవునా పాలేరుతనం చేస్తున్నాం. అది ఎలా చెబితే మనం అలా వింటున్నాం కాని మనం చెబితే అది వినేటట్టు చేసి, దానిని మనం స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యటం లేదు. పెద్దల యొక్క సహవాసం ఎందుకు చెయ్యమన్నారు అంటే దానివలన మన మనసుని మనం స్వాధీనంలోకి తెచ్చువకోటానికి సహకారం అవుతుంది. నిన్నేమార్చి యరుగనీక యుల్లముపైని ఉరుదిగానుండుమా అరుణాచలా! ఓ అరుణాచలేశ్వరుడా నిన్ను మాయ చేసి నా మనస్సు ఎక్కడికి పారిపోకుండా యుల్లము పైని, ఈ మనస్సు పైని, ఉరుదిగా కదలకుండా కూర్చో నువ్వు, నా మనస్సు అటు ఇటు తిరుగుతోంది. నా మనస్సు చపలత్వంగా ఉంది. నా మనసుకి ఏకాగ్రత కుదరటం లేదు. నా మనసుకి నిర్మలత్వం కుదరటం లేదు. అందుచేత ఈ మనసు అటు, ఇటు పోతోంది. ఓ అరుణాచలేశ్వరుడా, నా మనసుని నా అంతట నేను స్వాధీనం చేసుకోలేను. నువ్వు సహాయం చెయ్యాలి. ఈ మనసు నాకు స్వాధీనం అయితేనే కాని నాకు శాంతి ఎలా ఉంటుందో తెలియదు. సుఖం ఎలా ఉంటుందో తెలియదు. ఎవడి మనసు వాడికి

స్వాధీనంలోకి వచ్చినప్పడే మోక్షం ఎలా ఉంటుందో, శాంతి ఎలా ఉంటుందో, ఆనందం ఎలా ఉంటుందో తెలుస్తుంది. ఎప్పడు? మీ మనస్సు మీకు స్వాధీనంలోకి వచ్చినప్పుడు, మీకు చిత్త శుద్ధి కలిగినప్పడు, అప్పడు తెలుస్తుంది. అందుచేత నా తెలివి తేటల వల్ల, నా ప్రయత్నం వల్ల, కేవలం నా సాహసం వల్ల మాత్రమే నా మనసుని నేను స్వాధీనంలోకి తెచ్చుకోలేను. దీనికి నీ సహాయం కావాలి.

ఓ అరుణాచలేశ్వరుడా ఈ మనసు ఎటువంటిది అంటే నిన్ను కూడా మాయ చేసి ఎక్కడికి అయినా పారిపోతుంది. అటువంటిది ఈ మనసు. అందుచేత నువ్వు ఏమి చెయ్యాలి అంటే ఈ మనస్సు ఎక్కడికి వెళ్ళకుండా, ఈ మనసులో ఉన్న చపలత్వాన్ని తీసేయ్ నువ్వు, ఈ మనసులో ఉన్న ఆందోళనని తీసేయ్, ఈ మనసులో ఉన్న ఆవేశాలు తీసేయ్, ఈ మనసులో ఉన్న రాగ ద్వేషాలు తీసేయ్, ఈ మనసులో ఉన్న కామ క్రోధాలు తీసేయ్, కామ క్రోధాలు ఉన్నంతకాలం, రాగ ద్వేషాలు ఉన్నంతకాలం ఆవేశం తోటి అది కుదురుగా ఉండదు. దానికి పొగరుబోతుతనం పెరుగుతూ ఉంటుంది. బహిర్ముఖం అవుతూ ఉంటుంది. విషయ చింతన చేస్తూ ఉంటుంది. ఎప్పడూ దుఃఖంలోనే ఉంటుంది. కామ క్రోధాలు ఉన్నంతకాలం అది సరళంగా ఉండదు. సూక్ష్మంగా ఉండదు. అందుచేత ఈ మనసులో ఉన్న దోషాలని నువ్వు తీసేయ్, నేను ప్రయత్నం చేస్తాను. నేను సాధన చేస్తాను. నేను చేసే సాధన సరిపోదు. అందుచేత నా దోషాలను తీసెయ్యటానికి సహకరించు నువ్వు. నువ్వు సహకరించాలి అంటే నా మనసు నెత్తి మీద నువ్వు కూర్చో, మనసు నెత్తిమీద నువ్వు కూర్చుని ఉంటే, కదలకుండా కూర్చుని ఉంటే అది అణిగిపోతుంది. ఎక్కడ? దాని స్వస్థానంలో ఈ మనసు అణిగిపోతుంది. ఆ పని నువ్వు చేసి పెట్టాలి, నీ సహకారం అర్థిస్తున్నాను నేను అని భగవాన్ శ్రీ రమణమహర్షి అరుణాచలేశ్వరుడిని అర్థిస్తున్నాడు.

మనకి కామం ఉంది, క్రోధం ఉంది, లోభం ఉంది, మోహం ఉంది, ఈ గుణాలే, ఈ దోషాలే మనసు. మనసులో దోషాలు ఉన్నంతకాలం ఆ మనసు అజ్ఞానం నుండి బయటకు రాదు. దోషాలలోంచి మనసు విడువడాలి. అందుకే మన పెద్దవాళ్లు నిష్కామకర్మ చెప్పారు.



**భగవంతుడిని నిరంతరం స్మరిస్తుంటే, భగవదాభిముఖంగా కనుక మన ప్రయాణం ఉంటే, నది వెళ్లి సముద్రంలో కలిసినట్టు మనం కూడా భగవంతుడిలో ఐక్యం అవుతాము!**

అంటే స్వార్థం లేకుండా పని చెయ్యమని, ప్రతిఫలం ఆశించకుండా పని చెయ్యమని చెప్పారు. ఏదైనా మనం పని సాధించాలి అంటే ఏకాగ్రత ఉండాలి. బాగా చదువు రావాలి అంటే ఏకాగ్రత ఉండాలి. మీ ఇంట్లో మీరు పని బాగా చేసుకోవాలి అంటే ఏకాగ్రత ఉండాలి. వంట బాగా వండాలి అంటే ఏకాగ్రత ఉండాలి. ఏకాగ్రత కనుక లేకపోతే మనం ఏ పని సరిగ్గా చెయ్యలేము. ఏకాగ్రత కనుక లేకపోతే మనం జీవితంలో ఈ లోకంలోకి వచ్చినందుకు ఏమి సాధించలేము. మనసుకి అటువంటి ఏకాగ్రత తీసుకురావటం కోసం, పవిత్రత తీసుకు రావటం కోసం భక్తి యోగం అని, జ్ఞాన యోగం అని, కర్మ యోగం అని, ఈ యోగాలు అన్నీ చెప్పారు. అందుచేత మనం జ్ఞానం సంపాదించాలి అంటే మనసులో ఉన్న దోషాలు తీసేయాలి. మనసుకి, దోషాలకి ఉన్న సంబంధాలని తెంచి వేయాలి. ఆ తెరను కత్తిరించాలి. అహంకారం అంటే ఏమిటి? దేహమాత్రుడినే నేను అనేటువంటి భావనే అహంకారం. ఈ మనస్సు మాత్రమే నేను అనేటువంటి పరిమితమైన భావనే అహంకారం. అందుచేత ఈ అహంకారమే మనకు ఎంతో దుఃఖం తీసుకువస్తుంది.

కొంతమంది మేము బెంగ పెట్టుకున్నాము అని అంటారు. ఎవరు బెంగ పెట్టుకున్నారు? ఈ అహంకారమే బెంగ పెట్టుకుంది. కొంతమందికి గర్వం వస్తూ ఉంటుంది. ఎవరికి గర్వం వస్తుంది? నీ అహంకారానికే గర్వం వస్తుంది. నేను మరణిస్తున్నాను అనుకుంటాడు, ఆ మరణిస్తున్నాను అని చెప్పేది ఎవరు?దేహం తోటి కలిసి ఉన్న నేను. అదే అహంకారం. నేను బాధ పడుతున్నాను, నేను దుఃఖ పడుతున్నాను, అని చెప్పేది కూడా అహంకారమే. దేహం తోటి కలిసి ఉన్న నేనే ఈ మాటలు అన్నీ చెబుతుంది. మనం జ్ఞానం సంపాదించటం కోసం ఈ లోకంలోకి వచ్చాం. జ్ఞానాన్ని సంపాదించే వరకు ఈ కష్టాలు, ఈ నష్టాలు, ఈ దుఃఖాలు, ఈ బాధలు, ఈ భారాలు, ఏమి తప్పవు. ఈ జన్మలో మీరు నాలుగు రోజులు సుఖంగా ఉన్నా జ్ఞానం కలిగే వరకు, మోక్షం పొందే వరకు, ప్రతీ వాడిని దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. ప్రతీ వాడిని అశాంతి వెంటాడుతూ ఉంటుంది. మనం జీవితంలోకి వచ్చిన పని ఏమిటి అంటే నేను ఎవరినో తెలుసుకోవటం. మనం లోకంలో అనేక విషయాలు తెలుసుకుంటున్నాం. లోకంలో అనేక విషయాలు గ్రహిస్తున్నాం. కాని నేను ఎవరినో నాకు తెలియటం లేదు. ఈ నేను అనేది అందరికి ఉంది కాని ఆ నేను గురించి మనకి తెలియటం లేదు. దానిని గ్రహించటానికి ప్రయత్నం చెయ్యటం లేదు. అది ఒక సమస్య, ఆ సమస్యని పరిష్కారం చేసుకోవటం కోసం ఏ ప్రయత్నం చెయ్యటం లేదు. ఆ ప్రయత్నం చెయ్యటమే సాధన. మీ మనసు యొక్క మూలం తెలుసుకోవటమే

సాధన. మీ మనసు పలుచబడేటట్టు పని చేయడమే సాధన.

ఒక ఎలిమెంటరి స్కూల్ లో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుడు ఆయనకు సంసారంలో ఏదో బాధలు ఉన్నాయి, ఈ బాధలు పడలేకపోతున్నా, ఎండ్రిన్ తాగి మరణిద్దాం అని ఆ మాష్టారు అనుకున్నాడు. ఎందుచేత? ఈ సంసారంలో ఉన్న కష్టం పడలేక, అప్పుడు ఆ మాష్టారు ఏమి అనుకున్నారు అంటే, మనం మరణించటానికి ఒక నిర్ణయానికి వచ్చాం. ఎండ్రిన్ తాగే ముందు రమణమహర్షి గారు మన ఊళ్లోనే ఉన్నారు, అందుచేత ఈ అరుణాచలస్వామి దగ్గరకు వెళ్ళి, రమణదేవుడు దగ్గరకి వెళ్ళి, ఒకసారి దర్శనం చేసుకుని వచ్చి ఎండ్రిన్ తాగుదాం. మహాత్ముల దర్శనం ముందు చేసుకుందాం, చివరిసారిగా ఆయన దర్శనం చేసుకుని వద్దాం అని ఈ మాష్టారు ఎండ్రిన్ డబ్బా కొనుక్కున్నారు. ఇంట్లో జాగ్రత్త పెట్టుకున్నారు. భగవాన్ దగ్గరకు వెళ్లారు కడసారిగా చూసి రావటం కోసం. స్వామి నేను మరణించటానికి సిద్ధంగా ఉన్నాను, నేను బాధలు భరించలేక పోతున్నాను అని భగవాన్ తోటి చెబుదాం అనే ఉద్దేశం ఈయనకు ఏమి లేదు. భగవాన్‌ని చూసి వెళదాం అని వచ్చాడు. భగవాన్ దగ్గరకు వచ్చి కూర్చొన్నారు, ఆ టైముకి భగవాన్ ఏమి చేస్తున్నారు అంటే ఓ కుట్టుడాకు కుట్టుకుంటున్నారు. ఏవండీ మాష్టారు మీరు ఎలా ఉన్నారు, కులాసాగా ఉన్నారా అని క్షేమ సమాచారం అడిగి, నేను ఈ ఆకు ఎందుకు కుట్టుకుంటున్నాను అని భగవాన్ ఆయనను అడిగారు. భగవాన్ కి ఆయన మనసులో ఉన్నది ఏమిటో తెలుస్తుంది, ఆయన ఎందుకు వచ్చారో తెలుస్తుంది. మీరు ఎందుకు వచ్చారు అని ఆయనను అడగటం లేదు. మీ ఉద్దేశ్యం ఇది అని ఎత్తి చూపించటం లేదు. కాని ఏమని అడిగారు అంటే ఈ కుట్టుడాకులు ఎందుకు కుట్టుకుంటున్నాను? అని ఆ మాష్టారుని అడిగారు. మీరు భోజనం చెయ్యటానికి ఆకు కుట్టుకుంటున్నారు అని ఆ మాష్టారు అన్నారు. అప్పుడు భగవాన్ అన్నారు నేను భోజనం చెయ్యటానికి ఈ ఆకు కుట్టుకుంటున్నాను అనుకోండి, భోజనం చెయ్యకుండా ఈ ఆకు పడేస్తాను అనుకోండి, అప్పుడు ఏమి అవుతుంది అని అడిగారు. భోజనం చెయ్యకుండా మీరు ఈ ఆకు పడేస్తే, ఇంకో ఆకు మీరు కుట్టుకోవాలి అన్నారు మాష్టారు. భోజనం చేసి పడేస్తే ఏమి అవుతుంది అన్నారు. భోజనం చేసి పడేస్తే ఇంకొక ఆకు అక్కర్లేదు అన్నారు. దాని అర్థం ఏమిటంటే మనకు శరీరం వచ్చినందుకు మనం మరణించే లోపులో జ్ఞానం సంపాదించిన తరువాత ఈ శరీరం పడిపోయినా ఫరవాలేదు. అన్నం తినేసిన తరువాత ఆకు పడేసినా ఫరవాలేదు. అన్నం తినక ముందు కనుక ఆకు పడేస్తే ఇంకొక ఆకు సంపాదించుకోవాలి. ఇంకో ఆకు కుట్టుకోవాలి. అదే విధంగా ఈ జన్మ వచ్చినందుకు

మనం అందరం జ్ఞానం సంపాదించాలి. జ్ఞానం సంపాదించకుండా ఈ శరీరం పడిపోయిందా ఇంకొక జన్మలోకి వెళ్ళాలి. జ్ఞానం సంపాదించిన తరువాత ఈ శరీరం పడిపోతే ఇంకొక జన్మ రాదు. ఇంక దేహాల తోటి పనిలేదు. ఇంక శరీరాల తోటి పని లేదు.

ఈ శరీరం గురించే మనం నిరంతరం ఆలోచిస్తూ ఉంటాం. మన ఆలోచనలు, మన తలంపులు, మన భావాలు, మన ఊహలు మన శరీరం చుట్టూ తిరుగుతాయి. ఇది నిజం కాదంటారా? మీరు ఏది చదివినా, పూజ చేసినా, జపం చేసినా, నేను బాగుండాలి, నా కుటుంబం బాగుండాలి, నా దేహం బాగుండాలి, నేను వందలాది సంవత్సరాలు జీవించాలి. తరువాత నా కొడుకులు, నా మనవళ్లు పెద్ద పెద్ద మంత్రులు అయిపోవాలి. నా కుటుంబం బాగుండాలి, నేను బాగుండాలి. అని కేవలం నీ సంసారం చుట్టూ, నీ శరీరం చుట్టూ, నీ కుటుంబం చుట్టూ, నీ తలంపులు తిరుగుతున్నాయా, లేదా? నీ ఆలోచనలు తిరుగు తున్నాయా, లేదా? మిమ్మల్ని మీరు వంచన చేసుకోకండి. మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి. నేను వైకుంఠానికి వెళ్లిపోవాలి, కైలాసానికి వెళ్ళిపోవాలి అని మిమ్మల్నే ప్రమాణంగా పెట్టుకుని, మిమ్మల్నే దృష్టిలో పెట్టుకుని మీరు యజ్ఞాలు చేస్తున్నారు, యాగాలు చేస్తున్నారు, పుణ్యాలు చేస్తున్నారు, వ్రతాలు చేస్తున్నారు. అన్నిటిని మీ కోసమే చేస్తున్నారు కాని జ్ఞానం కోసం, ఆత్మ కోసం, దేవుడు కోసం మీరు ఏదైనా ఒక చిన్న కార్యం చేశారా? మీ వాసనలు ఏదైనా త్యాగం చేశారా? జాగ్రత్తగా పరిశీలన చేసుకోండి.

మనకి కావలసింది విషయానందం, ఆత్మానందం కాదు. విషయానందంలో ఉండటం వల్ల, ఆత్మ యొక్క రుచే తెలియటం లేదు. ఆత్మానందం యొక్క రుచే తెలియటం లేదు. ఆత్మానందం ఎలా ఉంటుందో ఒక్కసారి రుచి చూస్తే, ఏ మానవుడు అయినా సరే వాడు ఏ మతస్తుడు అయినా సరే, వాడు ఏ కులస్తుడు అయినా సరే, వాడు ఏ జాతి వాడు అయినా సరే, ఆత్మానందం అనేది ఆ దైవీ ఆనందం అనేది ఒక్కసారి జీవితంలో వాడు కనుక రుచి చూస్తే, వాడి మనస్సు ఇక బహిర్ముఖం కాదు. నువ్వు బయటకు పో అని వాడి మనసుని అన్నా అది బయటకు వెళ్ళదు. అయితే మనం విషయాలను చూసి సంతోషిస్తున్నాం. మనం అనుభవిస్తున్న భోగాలు చూసి మనం సంతోషిస్తున్నాం. మన సంపదలను చూసి మనం సంతోషిస్తున్నాం. విషయానందం మనం పొందుతున్నాము. మన వాసనలు చూసి మనం పొంగిపోతున్నాం. మనకి ఎప్పుడైనా సంతోషం వస్తే, ఆనందం వస్తే అది ఆత్మకి సంబంధించినది కాదు. మనం వాసనానందమే, విషయానందమే పొందుతున్నాం,

అందుచేత అది కొన్ని సెకన్లు ఉంటుంది, తరువాత మరు సెకనులో కరిగిపోతూ ఉంటుంది. అది నిజం కాదు, అది వాస్తవం కాదు. అందుచేత మంచు కరిగినట్టు కరిగిపోతూ ఉంటుంది. అది నిజం లాగా కనిపిస్తుంది కానీ నిజం కాదు. అది సత్యం లాగా కనిపిస్తుంది కానీ సత్యం కాదు. అందుకే శంకరాచార్యుల వారు ఈ లోకం అంతా మిథ్య అన్నారు. మిథ్య అంటే నిజంగా కనిపిస్తూ ఉంటుంది కాని నిజం కాదు. ఈ మనసుకి రాగ ద్వేషాలు వస్తూ ఉంటాయి. అందుచేత ఈ రాగ ద్వేషాలనే కేంద్రంగా పెట్టుకుని మనం ఆలోచిస్తున్నాం.

మీరు ఏమి అనుకుంటారు అంటే, మనం మరణించిన తరువాత కైలాసానికి వెళ్ళిపోతాం, వైకుంఠానికి వెళ్ళిపోతాం దానికోసం ఇప్పటి నుంచి పుణ్యాలు చెయ్యాలి అని అనుకుంటున్నారు. కాని కృష్ణుడు ఏమి అన్నాడు అంటే మీరు మోక్షం పొందాలి అంటే, శాంతి పొందాలి అంటే, ఆత్మానందం పొందాలి అంటే, మీరు మరణించే వరకు ఆగక్కర్లేదు. అప్పటి దాకా ఎందుకు ఇది cash బేరమే. అరువు బేరం కాదు ఇది. ఇప్పుడే ఇక్కడే, మీరు గొప్ప స్థితిని, ఆనంద స్థితిని, మోక్ష స్థితిని మీరు పొందవచ్చు అని చెప్పాడు. ఎవడైతే రాగద్వేషాల నుండి విడుదల పొందాడో వాడు ఆనంద స్థితిని పొందుతాడు. అయితే ఎవరైనా విడుదల పొందారా ఇక్కడ? మీలో అశాంతికి కారణం బాహ్య పరిస్థితులు అని మీరు అనుకుంటారు, బాహ్య పరిస్థితులు కాదు. మీలో ఉన్న రాగమే కారణం, మీలో ఉన్న ద్వేషమే కారణం. బాగా చదువుకున్న ఒక పండితుడు మాటల సందర్భంలో నిన్నటి రోజున ఏమి అన్నారు అంటే ఏవండీ భగవంతుడు భయాన్ని విడిచి పెట్టమంటున్నాడు, కోపాన్ని విడిచి పెట్టమంటున్నాడు. మనం విడిచి పెట్టం అనుకోండి భగవంతుడికి ఏమైనా నష్టమా? భగవంతుడికి ఏమి నష్టం లేదు. మీకు రాగం ఉన్నంత సేపు, మీకు మమకారం ఉన్నంత సేపు, అహంకారం ఉన్నంత సేపు మీకు దుఃఖం వస్తుంది. దుఃఖం నుండి విడుదల పొందలేరు. ఏ లోకంలోకి వెళ్ళినా, ఏ జన్మలోకి వెళ్ళినా, మీకు అహంకారం ఉన్నంతకాలం, మమకారం ఉన్నంతకాలం, ఏదో ఒక రూపంలో దుఃఖం మిమ్మల్ని వెంటాడుతుంది. అది మిమ్మల్ని విడిచి పెట్టదు. అది బంధించే తీరుతుంది. మనసు మనసు అంటే ఏమీ లేదు తలంపే! తలంపు లేకుండా మనసు లేదు. తలంపు లేకుండా రాగం లేదు. తలంపు లేకుండా ద్వేషం లేదు. తలంపు లేకుండా కక్ష లేదు, తలంపు లేకుండా లోభిత్వం లేదు, ప్రతీది తలంపే. అందుచేత తలంపుని విడిచి పెట్టగలగాలి. తలంపుని తీసేస్తే మనసు లేదు.

ఇక్కడ ఎవరైనా పెద్ద పెద్ద పండితులు ఉండవచ్చు, ఇంకా ఎంతోమంది చదువుకున్న వాళ్ళు ఉండచ్చు. ఆలోచించండి నేను ఎన్నో సాధించాను జీవితంలో అని అనుకుంటున్నాను.

నా తలంపు నా చేతిలో ఉందా? నాకు ఇష్టం లేని తలంపులు వస్తున్నాయి. ఈ తలంపులు నాకు వద్దు. ఈ తలంపు వలన నాకు దుఃఖం వస్తుంది అని నేను అనుకున్నప్పటికీ, ఏ తలంపు అయితే నేను వద్దు అనుకుంటున్నానో, ఆ తలంపే వచ్చి నా నెత్తి మీద కూర్చొంటుంది. నా తలంపులు, నా ఆలోచనలే నా స్వాధీనంలో లేనప్పుడు, నేను ఏదో ఉద్ధరిస్తాను అంటే ఎవరిని ఉద్ధరించగలను? అదే రమణమహర్షి గారు చెప్పారు, నీకు తినటానికి మెతుకులు లేవు, అన్న సత్రం పెడతాను అంటావేమిటి అన్నారు. నీ తలంపులు నీ స్వాధీనంలో లేవు, నీ ఆలోచనలు నీ స్వాధీనంలో లేవు, నీ ఇంద్రియాలు నీ స్వాధీనంలో లేవు, నీ ఊహలు నీ స్వాధీనంలో లేవు, నీ శరీరం నీ స్వాధీనంలో లేదు. ఏది నీ స్వాధీనంలో లేదు, నేను లోకాన్ని ఉద్ధరిస్తాను, లోకాన్ని ఉద్ధరిస్తాను అంటావు. ఏమి ఉద్ధరిస్తావు లోకాన్ని? నేను ఎంతవరకు పవిత్రుడని అయ్యానో అంతవరకు నేను మీకు ఉపయోగపడగలను. నాలో లేనిది నేను మీకు ఏది ఇవ్వలేను. నాలో శాంతి ఉంటే ఆ ప్రభావం నీ మీద కొంచెం ఉంటుంది. నాలో లేనిది మీకు నేను ఏమి ఇవ్వలేను. అందుచేత ఏదైతే నేను అవ్వాలి అనుకుంటున్నానో దానికోసం నేను కృషి చెయ్యాలి. దానికోసం నా దేహాన్ని, నా మనసుని, నా ఇంద్రియాలని ఖర్చు పెట్టాలి. దానికోసం dedicate చెయ్యాలి.

అందరికి ఏమి కావాలి? సుఖం కావాలి. సుఖం ఎవరికి వస్తుంది? శాంతి ఉన్న వాడికి వస్తుంది. శాంతి ఎవడికి వస్తుంది? తన మనసు అదుపులో ఉన్నవాడికి శాంతి వస్తుంది. నిరంతరం భగవంతుడిని, ఆత్మని చింతించే వాడికి శాంతి వస్తుంది. మీ అందరూ ప్రశాంతంగా ఆలోచించి చెప్పండి, మనం అందరం విషయాలను చింతిస్తున్నామా? లేకపోతే ఇంద్రియాలను చింతిస్తున్నామా? లేకపోతే భగవంతుడిని చింతిస్తున్నామా? మీరు చేసే పొరపాటు, నేను చేసే పొరపాటు, అందరం చేసే పొరపాటు ఏమిటి అంటే విషయాన్ని చింతిస్తున్నాం. విషయాన్ని చింతిస్తే result ఏమిటి అంటే దుఃఖం వస్తుంది. ఈ మాటలు మన బాగు కోసం భగవంతుడు చెప్పినటువంటి మాటలు. కామ క్రోధాలు విడిచి పెడితే నాకు శాంతి కలుగుతుంది. అందుచేత విడిచి పెట్టమని చెప్పాడు. మన శరీరానికి వయసు

**ఆధ్యాత్మిక మార్గంలో కానీ, భౌతిక జీవితంలో కానీ, అభివృద్ధిలోకి రావాలి అంటే రెండు ముఖ్యం. ఒకటి ఆత్మవిశ్వాసం, రెండు క్రమశిక్షణ.**



నలభై యేళ్ళో ముప్ఫై యేళ్ళో ఉంటాయి అంతే, కాని కామ క్రోధాల యొక్క వయసు, ఈ రాగ ద్వేషాల యొక్క వయసు, అవి ఎన్ని జన్మల నుండి మన కూడా వస్తున్నాయో, అందుచేత ఈశ్వరుడి సహాయం లేకుండా, దైవం యొక్క సహాయం లేకుండా వాటిని జయించలేము. ఓ అరుణాచలేశ్వరుడా వాటిని జయించడానికి నాకు సహాయం చెయ్యమని ప్రార్థిస్తున్నాడు రమణమహర్షి.

కత్తి యొక్క అంచు మీద నడిచే వాడు ఎంత జాగ్రత్తగా నడుస్తాడో అది తెగకుండా ఉండడం కోసం, భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేసేవాడు కూడా అంత జాగ్రత్తగా ప్రయత్నం చెయ్యాలి, అంత మెలకువగా ప్రయత్నం చెయ్యాలి. ఎవడైతే కామ క్రోధాల నుంచి విడుదల పొందాడో, వాడికి మరణానంతరం కాదు, ఇప్పడే, ఇక్కడే, సర్వత్రా వాడికి బ్రహ్మ నిర్వాణం ఉన్నది. మానసికమైనటువంటి బలహీనతలు ఎవరిలో అయితే రాలిపోయాయో, ఎవరిలో అయితే కాలిపోయాయో వాడిని మోక్షం వరిస్తుంది, వాడు మోక్షసుఖం పొందుతాడు అని వాసుదేవుడు చెప్పాడు. ఎప్పడో వస్తుంది అని మీరు ఎదురు చూడక్కరలేదు. అది ఇప్పడే ఉంది, అది ఇక్కడే ఉంది. మనం ఆత్మలోనే ఉన్నాం కాని మనకు ఎక్కడో దూరాన ఉన్నట్టు అనిపిస్తుంది. దానికి కారణం ఏమిటి అంటే మన వాంఛలు, మన కోరికలు. మనకు కోరిక లేకపోతే ఆ పని అవ్వదు ఏమో అని మనం అనుకుంటాము కానీ భగవంతుడి యొక్క సంకల్పం ప్రకారం ఈ ప్రపంచం అంతా నడుస్తుంది, మన జీవితాలు నడుస్తున్నాయి, మీరు భగవంతుడిని నిరంతరం చింతిస్తూ ఉంటే ఎప్పడు మీకు ఏ పని అవ్వాలో ఆ పని జరుగుతూనే ఉంటుంది. అందుచేత కోరిక విడిచి పెట్టేస్తే పని అవ్వదు ఏమో అని మీరు ఎవరు అనుకోవక్కర్లేదు. మనసు యొక్క మూలాన్ని ఏ మనసు అయితే చూసిందో, అప్పడు ఆ మూలం నుండి వచ్చే సంతోషాన్ని పొందుతున్నప్పడు నువ్వు ఎంత సంతోషం పొందుతున్నావు? అని సంతోషం పొందేవాడినే కనుక అడిగితే వాడు చెప్పలేడు. అటువంటి గొప్ప సంతోషాన్ని, అటువంటి గొప్ప శాంతిని, మీరు ఇప్పడే ఇక్కడే పొందవచ్చు. ఎప్పడు? మనసు అణిగిపోయినప్పడు. ఏ విషయం మీదకి అయితే మన మనసు వెళుతుందో అందులోని అల్పత్వాన్ని, అది గ్రహించాలి. మన మనసు గ్రహిస్తేనే కాని అది వెనక్కి రాదు, సారవంత మైనది అక్కడ ఏమి లేదు అని మన మనసుకి అర్థం అయినప్పడే అది అంతర్ముఖం అవుతుంది కాని లేకపోతే అది అంతర్ముఖం కాదు. అందుచేత ఆత్మ యొక్క గొప్పతనం మనకు తెలియాలి, ఆత్మ గురించి మనసుకి తెలియాలి అంటే ఆత్మ గురించి వినాలి.

మనం ఎంతసేపు లోకం గురించి వింటున్నాం ఆత్మ గురించి వినటం లేదు. అందుచేత ఆత్మ యొక్క గొప్పతనం శ్రవణం చెయ్యాలి. శ్రవణం చెయ్యగా, చెయ్యగా ఆత్మ గురించి వినగా, వినగా ఆత్మని పొందాలి అనే కాంక్ష మన హృదయం నుండే వస్తుంది. ఆ కాంక్షే మనలని మోక్ష ద్వారం వైపుకి తీసుకు వెళుతుంది.

మీకు అందరికి అవకాశం ఉన్నప్పుడు తప్పనిసరిగా అరుణ గిరి యాత్ర చేయండి. రమణస్వామి ఎప్పుడూ, ఎవరిని ఏమి అడిగేవారు కాదు. ఎప్పుడూ, ఎవరిని అడగని స్వామి ఒకటి అడిగేవారు. మీరు గిరి ప్రదక్షిణం చేసి వచ్చారా? అని. ఏవండీ గిరిలో ఏముంది, ఏమి లేదు అంటే ఒకసారి మీరు ప్రదక్షిణ చేయండి, తరువాత మీకే తెలుస్తుంది. అంటే ఆ ప్రదక్షిణలో అంత విశేషం ఉంది. మీలో అవకాశం ఉన్నవాళ్లు ఒకసారి అరుణ గిరి ప్రదక్షిణం చేయండి. సందర్భం వచ్చింది కాబట్టి ఈ రెండు మాటలు చెప్పాను. కాశీలో మరణిస్తే మోక్షం వస్తుంది అని ఉంది. అరుణాచలం అలా కాదు, కేవలం మీరు జ్ఞాపకం పెట్టుకోవటం వల్ల, అరుణాచల, అరుణాచల, అరుణాచల, అరుణాచల అని మీ మనస్సులో అరుణాచలాన్ని నిరంతరం స్మరించడం వల్ల, ఆ గిరిని ధ్యానించడం వల్లే మీకు మోక్షం వస్తుంది. మీరు యజ్ఞాలు చెయ్యనక్కరలేదు, యాగాలు చెయ్యనక్కరలేదు. జ్ఞాపకం చాలు, స్మరణ చాలు, అది మీకు మోక్షం ఇచ్చి తీరుతుంది అని స్కంధ పురాణంలో, శివ పురాణంలో అరుణాచలం యొక్క క్షేత్ర వైభవం గురించి చెప్పారు. ఎవరైతే అరుణాచల, అరుణాచల అని స్మరిస్తున్నారో, మీకు తెలియకుండానే మీ అహంకారాన్ని నాశనం చేస్తుంది. మీ మనో నాశనం చేసే క్షేత్రం, అహంకారాన్ని నాశనం చేసే క్షేత్రం, అహంకారాన్ని నాశనం చేసి మీ స్వరూపాన్ని మీకు పట్టిచ్చే క్షేత్రం. పరమేశ్వరుడు తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. ఎప్పుడు? మనం అహంకారానికి దూరం కనుక అయితే, పరమేశ్వరుడు తన స్వరూపాన్ని మనకి ఇస్తాడు. అందుచేత అరుణాచల మనుచు స్మరించు వారల, ఎవరైతే అరుణాచల, అరుణాచల అని స్మరిస్తున్నారో, వాళ్ళ యొక్క అహంకారం తీసేస్తాడు అట పరమేశ్వరుడు.

నిప్పా నీ మీద నేను చెయ్యి వేస్తున్నాను. నువ్వు నన్ను కాల్చు అని అడగాలా? మీరు అడగకపోతే కాల్చదా? మనకి తెలిసినా, తెలియకపోయినా నిప్ప మీద కనుక చెయ్యి వేస్తే, అది కాల్చి తీరుతుంది. అదే విధంగా మీరు సరదాగా అనుకున్నా, భక్తి తోటి అనుకున్నా, కాలక్షేపం కోసం అనుకున్నా, ఎలా అనుకున్నా సరే అరుణాచల, అరుణాచల, అరుణాచల అని ఆ పరమేశ్వరుడిని మీరు ఏ ఉద్దేశ్యం తోటి స్మరించుకున్నా, చిత్తశుద్ధి కోసం మీరు స్మరించుకున్నా, లేకపోతే కోరికలు fulfill అవ్వడం కోసం మీరు స్మరించుకున్నా, ఏ కారణం

తోటి మీరు స్మరించుకున్నప్పటికీ అది చేసే పని మటుకు మీ అహంకారం నిర్మూలన చేస్తుంది. అందుచేత మీరు ఇష్టంగా చెయ్యండి, అయిష్టంగా చెయ్యండి. ఎలా చేసినా సరే అది మీ అహంకారాన్ని నిర్మూలించి విడిచి పెడుతుంది. అందుచేత అరుణాచల స్మరణ విడిచి పెట్టవద్దు అని స్కాందపురాణంలో మహత్తరంగా దాని గురించి రాశారు.

ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే, ఓ అరుణాచలేశ్వరుడా, నా మనసు మీద నువ్వు కూర్చుని ఉండు, నువ్వు ఏదో పరాకుగా ఉంటావు అనుకో నిన్ను కాదు అని తప్పించుకుని వెళ్ళిపోతుంది. అందుచేత నువ్వు దీనిమీదే కూర్చో, నువ్వు అలా ఎప్పుడైతే నా మనసు మీద స్థిరంగా ఉన్నావో, కదలకుండా కూర్చున్నావో అప్పుడు ఏమి అవుతుంది? నెమ్మదిగా అణిగిపోతుంది. దీని చలనం పోతుంది. విక్షేపం పోతుంది, విక్షేపం ఉన్నంత సేపు శ్రద్ధ కుదరదు. మన మనసులో విక్షేప దోషం పోయిన రోజున మనకి ఆత్మవిద్య పట్ల, మోక్షవిద్య పట్ల శ్రద్ధ కుదురుతుంది. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, శ్రద్ధ వల్లే జ్ఞానం వస్తుంది. శ్రద్ధ ఎలా వస్తుంది? మనసులో విక్షేప దోషం కనుక ఉంటే, మనసులో చాపల్యం కనుక ఉంటే, వాడికి శ్రద్ధ రాదు. అందుచేత నువ్వు నా మనసులో ఉన్న చాపల్యం పోగొట్టటం కోసం, నా మనసులో ఉన్న హెచ్చు తగ్గులు పోగొట్టటం కోసం, సమానంగా ఉండేటట్టు చెయ్యటం కోసం, నువ్వు స్థిరంగా నా మనసు మీద కూర్చో ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు అనుగ్రహించే స్వభావం కలవాడివి కాబట్టి, నన్ను అనుగ్రహించు, నా మనసుని ఆత్మలో లయం చెయ్యి, మనసే దుఃఖానికి కారణం, మనస్సే బంధానికి కారణం. బంధానికి కారణం అయినటువంటి, దుఃఖానికి కారణం అయినటువంటి, విషాదానికి కారణం అయినటువంటి, ఈ మనసును హృదయంలో అణిగిపోయేటట్టు చెయ్యి. ఈ మనసు స్థిరంగా, ఏకాగ్రంగా, ప్రశాంతంగా ఉండేటట్టు అనుగ్రహించు స్వామి అంటున్నారు.

హృదయం, హృదయం అంటే మన డాక్టర్లు చెప్పే heart లాంటిది కాదు. మనిషిని కోసి చూస్తే అది కనపడదు. ఈ నేను నేను అనే శబ్దం వచ్చేది మాంసం అయ్యే హృదయం కాదు. డాక్టర్లు చెప్పే మామూలు గుండె కాయ లోంచి కాదు. అది ఆధ్యాత్మిక హృదయం, అందరి హృదయాలలోను నేను ఉన్నాను అని భగవంతుడు చెప్పినప్పుడు ఆయన address ఏమిటి అంటే మన ఆధ్యాత్మిక హృదయంలోనే ఉన్నాడు. నేను యొక్క మూలం ఇక్కడే ఉంది, భగవంతుడి యొక్క నివాసం ఇక్కడే ఉంది. అది స్మశానంలో మన శరీరాలు కాల్చినప్పుడు కాలబడదు. భగవంతుడు నేను హృదయంలో ఉన్నాను అని చెప్పాడు చూశారు. ఆ హృదయం మటుకు కాలదు. ఈ మనసుకి మూలం అదే. ఆ హృదయంలో, మనం

చేసిన పుణ్యం, మనం చేస్తున్న పాపం, మనం చేస్తున్న మంచి, మనం చేస్తున్న చెడ్డ, మనం చేస్తున్న ప్రతీ పని కూడా మీ హృదయం జాగ్రత్త పెట్టి ఉంచుతుంది. మీరు చేసిన పనులు అన్నీ మీరు మర్చిపోవచ్చు కాని పరమేశ్వరుడు మర్చిపోడు. ఎందుచేత? మీకు బహుమతి ఇవ్వాలి, మీరు చేసిన మంచికి మంచి, చెడ్డకి చెడ్డ, ఎత్తుకి ఎత్తు ఇస్తాడు మీకు. మిమ్మల్ని విడిచి పెట్టడు, మీరు మంచి చేస్తే మంచి ఇస్తాడు. చెడ్డ చేస్తే చెడ్డ ఇస్తాడు. ఇవన్నీ ఎక్కడ జాగ్రత్త పెడతాడు? ఎక్కడో జాగ్రత్త పెట్టడు, మీ హృదయంలోనే జాగ్రత్త పెడతాడు. ఈ వాసనలు, అవి మంచి వాసనలు అవ్వనివ్వండి, చెడ్డ వాసనలు అవ్వనివ్వండి, అన్నీ మన హృదయంలోనే ఉంటాయి. అది మాంసమయ హృదయం కాదు, అది ఆధ్యాత్మిక హృదయం, అది స్మశానంలో కాలదు. అది మన కూడా ప్రయాణం చేస్తూనే ఉంటుంది. ఆ హృదయంలో మనసు అణిగిపోవాలి. అప్పుడు కాని వాడికి జ్ఞానం కలగదు.

**ఊరూరు తిరుగక యుల్లము నిను గని యణగ నీ ద్యుతి జూపు మరుణాచలా**

ఓ అరుణాచలేశ్వరుడా! ఇప్పుడు నా మనసు ఏమి చేస్తుంది అంటే, ఊరూరు తిరుగుతోంది. ఇది కాదు అది అని, అది కాదు ఇది అని, ఈ మతం కాదు ఆ మతం అని, ఆ మతం కాదు ఈ మతం అని, ఈ దేవుడు కాదు ఆ దేవుడు అని, ఆ దేవుడు కాదు ఈ దేవుడు అని ఇలా తిరుగుతోంది. ఈ మనసుకి ఒక స్థిరత్వం లేదు. ఒక నిలకడ లేదు. సాధన విషయంలో స్థిరంగా లేదు, లోక వ్యవహారంలో స్థిరంగా లేదు, ఒక మాట నిలకడ లేదు, ఒక తలంపు నిలకడ లేదు. ఏ విషయంలోనూ studyగా ఉండటం లేదు మనసు, ఇటు అటు waveringగా తిరుగుతోంది. ఓ అరుణాచలేశ్వరుడా! ఇది మాములుగా లొంగుతుందా? ఇది తేలికగా లొంగుతుందా? తేలికగా లొంగదు, అందుచేత నీ ప్రకాశం చూపించు, నీ తేజస్సు చూపించు, నీ వైభవాన్ని చూపించు.

ఈ మనసుకి కనుక చూపిస్తే లొంగి పోతుంది. ఇప్పుడు చూడండి పచ్చ గడ్డి తిన్న దూడకి పక్కన మీరు వొట్టి గడ్డి వెయ్యండి తింటుంది ఏమో, తినదు ఎందుకంటే పచ్చ గడ్డి తినటానికి అది అలవాటు పడింది. అదే విధంగా నీ యొక్క తేజస్సు, నీ రుచిని, నీ శాంతిని, ఈ మనసుకి ఒకసారి చూపించు. చూపించాక ఏమి అవుతుంది అంటే ఇది అణిగిపోతుంది. ఊరూరు తిరగదు. అందుచేత ఇది నిలకడగా ఉండాలి అంటే నీ శక్తిని చూపించు, నీ తేజస్సుని చూపించు. నీ ప్రకాశాన్ని చూపించు, నీ అనుగ్రహాన్ని చూపించు. నీ అనుగ్రహం ఎప్పుడైతే మనసు మీద పడిందో, అప్పుడు కదలమన్నా కదలదు, మెదలమన్నా మెదలదు. ఏమండీ

స్వామి నా మనసు కదులుతోంది. జపం చేసుకోటానికి కూర్చొంటున్నాం, నోరు ఏమో రామా రామా అంటుంది. కృష్ణా, కృష్ణా, అంటుంది. కాని మనసు అక్కడకి, ఇక్కడకి వెళ్లిపోతోంది అని రమణస్వామిని అడిగారు. అప్పడు భగవాన్ "నీ మనస్సుని ఆగమంటే ఆగట్లేదు. నా మనసుని కదలమంటే కదలటం లేదు" అన్నారు. నేను జపం చేస్తున్నాను నా మనసు ఆగమంటే ఆగట్లేదు అంటే దానికి ఎక్కడ అయితే వాసన ఉందో అక్కడికే పోతుంది మరి.

మనకి మరణం వస్తుంది అనేటప్పటికి అందరికీ భయం వేస్తుంది. భయానికి కారణం ఏమిటి అంటే మళ్లీ ఈ విస్సా కోడేరు కనపడదు ఏమో అని, దేహం లేకుండా లోకాన్ని ఎవరైనా చూస్తారా? జ్ఞానం కలిగే వరకు ఎవడి దేహం కోసం వాడు పడి చస్తాడు. వాడికి ఎంతసేపు దేహదృష్టే ఉంటుంది. చావు అంటే మనకు ఎందుకు భయం వేస్తుంది? లోకం కనపడదు అని, కళ్లతోటి లోకాన్ని చూస్తున్నాం అనుకుంటున్నాం. కాని కళ్ల ద్వారా చూసేది అహంకారం. నన్ను ఎవరైనా పొగడనివ్వండి వెంటనే సంతోషం వచ్చేస్తుంది. ఎవరికి సంతోషం వస్తుంది? అహంకారానికి, విమర్శిస్తే ఎవరికి దుఃఖం వస్తుంది? అహంకారానికి. నాకు మరణం వచ్చింది అనుకోండి నేను చచ్చిపోతున్నాను, నేను చచ్చిపోతున్నాను అనుకుంటున్నాడు. ఎవరు చచ్చిపోతున్నారు? దేహం చచ్చిపోతుంది. బాధ పడేది ఎవరు? అహంకారం బాధ పడుతుంది. ఎందుచేత? లోకాన్ని చూసేది ఎవరు? అహంకారమే. ఈ అహంకారానికే లోకం కావాలి, దేహం కావాలి. అందుచేత అహంకారం ఉన్నంత సేపు దేహం వస్తుంది, లోకం ఉంటుంది. అందుచేత దేహం రాదేమో అని మీరు కంగారు పడకండి వచ్చి తీరుతుంది. అహంకారం ఉన్నంత సేపు దేహం వస్తుంది, దేహం వచ్చాక లోకం వస్తుంది. అందుచేత లోకం అహంకారానికే, దేహం అహంకారానికే! ఈ అహంకారానికి మటుకు రూపం లేదు. కానీ ఏదో ఒక రూపాన్ని పట్టుకొనే ఉంటుంది. రూప పూజ మనవాళ్లు ఎందుకు పెట్టారు అంటే, అహంకారానికి ఎంతసేపు రూపం కావాలి. ఆత్మ విచారణ చెయ్యమంటే చాలా కష్టం. శివుడిని పూజించటమంటే పూజిస్తారు ఎందుకంటే అక్కడ రూపం ఉంటుంది. ఈ అహంకారానికి ఎంతసేపు రూపం కావాలి. దానికి మేత



**మనల్ని చూసి ఎవరైనా అసూయ పడుతున్నారు అనుకోండి, వాళ్ళ మీద విరోధం పెంచుకోవద్దు, కాని వారికి దూరంగా ఉండాలి.**

ఏమిటి అంటే రూపం. ఒక రూపాన్ని పట్టుకుంటూ ఉంటుంది, ఆ రూపాన్ని విడిచిపెట్టి ఇంకో రూపం పట్టుకొంటుంది. నామం, రూపం, నామం, రూపం ఇవే మేత ఈ అహంకారానికి, లోకం ఎవరికి కావాలి? అహంకారానికే కావాలి. ఈ కళ్ళ ద్వారా లోకాన్ని ఎవరు చూస్తున్నారు? అహంకారమే చూస్తుంది. అందుచేత మనలో హెచ్చు తగ్గులకి ఏది కారణం? అహంకారమే కారణం.

నేను మాట్లాడుతుంటే అహంకారం కోసం మాట్లాడుతున్నాను. చేతి తోటి పని చేస్తే అహంకారం కోసం చేస్తున్నాను. ఆలోచనలు వస్తే అహంకారం కోసం ఆలోచనలు వస్తున్నాయి. నేను అహంకారం కోసమే చేస్తూ ఉంటే నాకు జ్ఞానం ఎలా వస్తుంది? ఈ సమస్య మీరు పరిష్కారం చేసుకోవాలి. మనం మాట్లాడాము అంటే అహంకారం తగ్గేలా మాట్లాడాలి. మనకి వచ్చే ఆలోచనలు అహంకారం తగ్గటానికి ఉపయోగ పడాలి. మనం చేత్తో చేసే పనులు అహంకారం తగ్గటానికి ఉపయోగ పడాలి. మనం ఏమి చేస్తున్నాం? ఏదైనా పని చేస్తే గొప్ప కోసం చేస్తున్నాం. దానివల్ల అహంకారం పెరుగుతుంది. మనం ఏమి మాట్లాడినా గొప్పల కోసం మాట్లాడతాము, ఆడంబరం కోసం మాట్లాడతాము. దానివల్ల అహంకారం పెరుగుతుంది. ఎదుటి మనిషి గురించి మంచి చెబుతుంటే మనం వినం, ఎదుటి మనిషి గురించి ఎవరైనా చెడ్డ చెబుతుంటే ఇంకొక సారి చెప్పండి, అప్పడు ఏమి అయ్యింది, అప్పడు ఏమి అయ్యింది అంటాము. అంటే చెడ్డను వినటానికి చెవులు ఇష్టపడు తున్నాయి. చెడ్డను మాట్లాడటానికి నోరు ఇష్ట పడుతుంది. ఇంద్రియాల తోటి ఇంత చెడ్డ చేస్తున్నాం, ప్రతీ ఇంద్రియాన్ని చెడ్డకి ఉపయోగిస్తున్నాం, అన్ని ఇంద్రియాలని అహంకారం పెంచటం కోసం ఖర్చు పెడుతూ, ఆలోచనలని, చెవులని, కళ్లని, కాళ్లని, చేతులని మానవుడికి ఉన్న సమస్త ఇంద్రియాలని అహంకారం పెంచటం కోసం ఖర్చు పెడుతూ జ్ఞానం కావాలి, జ్ఞానం కావాలి అంటే జ్ఞానం ఎలా వస్తుంది?

మీరు పాలకొల్లు వైపుకి ప్రయాణం చేస్తూ నాకు భీమవరం రావాలి అంటే వస్తుందా? అసలు మనం ప్రయాణం చేసే direction wrong directionలో పోతున్నాం, అసలు మనం తెలుసుకోవలసింది ఏమిటి? మనం పొందవలసినది ఏమిటి? అనేటువంటి ఒక గమ్యం లేకుండా మనం ప్రయాణం చేస్తున్నాం. మనం జీవిస్తున్నాం, మనం జీవించే జీవితంలో, మనం మాట్లాడే మాటల్లో, మనకొచ్చే ఆలోచనలో, మన అహంకారం మన అజ్ఞానం పెరిగేటట్టే ఉంది కాని అది పలుచబడేటట్టు లేదు. ఏ విధంగా అయితే మన అహంకారం ఉబ్బుతుందో,

ఆ రకమైన జీవితం మనం జీవిస్తున్నాం కాబట్టి అహంకారం నుండి విడుదల పొందలేము, అందుకే మనం మోక్షాన్ని కూడా పొందలేము.

ఈ అహంకారం ఎటువంటిది అంటే రమణస్వామి చెప్పేవారు, దీనికి లోకాన్నే కాదు దేవుణ్ణి కూడా తినేయాలి అని ఉంటుంది. ఎందుచేత అంటే అహంకారం యొక్క విజృంభణ అటువంటిది. నా స్వరూపాన్ని ఎవడూ తెలుసుకోలేడు, నా మాయని ఎవడూ జయించలేడు అని పరమాత్మ చెప్పాడు. దానికి కారణం ఏమిటి అంటే అహంకారం. అహంకారం వల్లే భగవంతుడి యొక్క స్వరూపం మనకి తెలియటం లేదు. నా మాయని ఎవరు జయించలేరు అనటానికి కారణం ఆయన మాయ ఎక్కడో లేదు, ఆయన మాయ కాశీలో లేదు, రామేశ్వరంలో లేదు. మాయ అంతా మనలోనే ఉంది. అహంకారం రూపంలో పెట్టేశాడు. అందుచేత తన అహంకారాన్ని తాను జయించకుండా, దానిని తొలగించు కోకుండా భగవంతుడిని చూడటం అనే సమస్యే లేదు. భగవంతుడు మనకి అనుభవంలో లేడు. ఆత్మ మనకి అనుభవంలో లేదు. శాంతి మనకి అనుభవంలో లేదు. అందుచేత లేదు అని అనుకుంటున్నాం. ఇది బాగా ఆలోచించండి. దేవుడు నాకు అనుభవంలో లేడు అందుచేత లేడు అనుకుంటున్నాను. నా అనుభవంలో ఉన్నది ఏమిటి? దేహం నా అనుభవంలో ఉంది, మనసు నా అనుభవంలో ఉంది, కోరికలు నా అనుభవంలో ఉన్నాయి, ఇంద్రియాలు నా అనుభవంలో ఉన్నాయి, నా అనుభవంలో ఉన్నదే నేను ఉంది అనుకుంటున్నాను, నా అనుభవంలో లేనిది లేదు అనుకుంటున్నాను. అందుచేత భగవంతుడు మనకి వివరంగా చెప్పవలసి వచ్చింది. మనకి తెలిసిన విషయం చెప్పటానికి కాదు మనకు తెలియని విషయం చెప్పటానికి భగవంతుడు గీత చెప్పాడు. అలా ఎందుకు ఉంది, ఇలా ఎందుకు ఉంది అంటే మీకు తెలియదు కాబట్టి గీతలో భగవంతుడు చెప్పాడు. ఓ అరుణాచలేశ్వరుడా, నీ జ్యోతిని చూపించు, నీ ప్రకాశాన్ని చూపించవయ్యా, నేను చీకట్లో ఉన్నాను అయ్యా, దారి నాకు కనిపించటంలేదు అయ్యా, నా కళ్ల ముందు కొంచెం వెలుగు ప్రసరింపజేయవయ్యా, ఒకవేళ నువ్వు వెలుగుని చూపించవు అనుకో నా జీవితం అంతా చీకటే. మరణించిన తరువాత ఏదో వస్తుంది అని ఎవరు అనుకోకండి. మరణించిన తరువాత ఏదీ రాదు. మళ్లీ జన్మ వచ్చాక సాధన చేయవలసిందే కాని, మరణించిన తరువాత తిరిగి జన్మ వచ్చే లోపుల సాధన ఏమి ఉండదు. శరీరం ఉండగా ఇప్పుడే మనం ప్రయత్నం చేసుకోవాలి కాని మనకి మరణానంతరం ప్రయత్నం చెయ్యటం సాధ్యం కాదు. శరీరం ఉండగా, ఈ లోకంలో ఉండగానే మన ప్రయత్నం మనం చేసుకోవాలి. అందుచేత ఇప్పుడు మనం

బహు జాగ్రత్తగా ఉండాలి. ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాలాన్ని నేను అని పరమేశ్వరుడు చెప్పాడు. అందుచేత ఈ కాలాన్ని మనం సద్వినియోగం చెయ్యటానికి ప్రయత్నం చెయ్యాలి. మనకు చూడండి కొంత కాలం ఒక కూతురు మీద ఇష్టం, కొంత కాలం ఇంకొక కూతురు మీద ఇష్టం, కొంతకాలం ఒక కోడలు మీద ఇష్టం, కొంతకాలం ఇంకొక కోడలు మీద ఇష్టం. ఇలా మన ఇష్టాలు మారుతూ ఉంటాయి. మన స్నేహితులు మారుతూ ఉంటారు, మన పరిసరాలు మారుతూ ఉంటాయి, మన దేహాలు మారుతూ ఉంటాయి, మన రాగాలు మారుతూ ఉంటాయి, మన ద్వేషాలు మారుతూ ఉంటాయి. మన జన్మలు మారిపోతాయి. అన్నీ మారిపోతాయి. మారనిది ఏమిటి అంటే అహంకారం.

మనం ఇక్కడ నుంచి పారిపోయాం అనుకో హిమాలయ పర్వతాలకి, అక్కడ ఏమి ఉంటాయి? కొండలు ఉంటాయి. ఇంకో ఊరు పారిపోతే ఇంకొకటి ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒక పరిసరం ఉంటుంది. ఈ పరిసరం కాకపోతే ఇంకొక పరిసరం ఉంటుంది, ఈ స్నేహితుడు కాకపోతే ఇంకొక స్నేహితుడు ఉంటాడు. ఈ దేహం కాకపోతే ఇంకొక దేహం ఉంటుంది. ఈ దేశం కాకపోతే ఇంకొక దేశం ఉంటుంది. ఈ కాలం కాకపోతే ఇంకొక కాలం ఉంటుంది. కాని ఎప్పుడూ మన కూడా వచ్చేది ఈ అహంకారం. అది నిన్ను విడిచి పెట్టదు. అహంకారం నాశనం అయ్యే వరకు అది నిన్ను విడిచి పెట్టదు. అది దుఃఖం రూపంలో, అజ్ఞానం రూపంలో, అది నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. అందుచేత అటువంటి అహంకారాన్ని పోగొట్టటం కోసం నీ శక్తిని చూపించు, నీ యుక్తిని చూపించు, నా అహంకారం జయించటం కోసం నాకు శక్తిని ప్రసాదించు. జ్ఞానాన్ని వైరాగ్యాన్ని నాకు ప్రసాదించు అరుణాచలేశ్వరుడా! నీ జ్యోతిని చూపించు, నీ వెలుగుని చూపించు, చూస్తే ఏమి అవుతుంది అంటే నీ వెలుగు యొక్క గొప్పతనం, దాని యొక్క ఔన్నత్యం మనసుకి తెలుస్తుంది. నువ్వు ఎంతటి వాడివో ఎప్పుడైతే ఈ మనసుకి తెలిసిందో, అప్పుడు ఈ మనసు నీకు స్వాధీనం అయిపోతుంది. అప్పుడు ఇంక నన్ను బాధ పెట్టదు. మనసు అల్ప విషయాల మీద స్వల్ప విషయాల మీద తిరుగుతుంది, నీ గొప్పతనం ఈ మనసుకి తెలియటం లేదు. పెద్దలు చెప్పినా, విన్నా అర్థం అవ్వటం లేదు. మనసు తాత్కాలికంగా విన్నంత సేపు బాగుంటుంది, తరువాత యధా ప్రకారం వాసన బట్టి వెళ్లిపోతూ ఉంటుంది. ఎవడి వాసన బట్టి వాడి మనసు అలా పరుగు పెడుతూ ఉంటుంది.

భగవద్గీత చెప్పింది, ప్రపంచంలో గొప్ప మత గ్రంధాలూ అన్నీ కూడా చెప్పినవి. ప్రతీ

వాడు వాసన బట్టి నడచుకుంటున్నాడు, తలంపు బట్టి నడచుకుంటున్నాడు. కోరిక బట్టి నడచుకుంటున్నాడు అని చెప్పింది రైటే, ఈ వాసన ఎక్కడ నుంచి వచ్చింది? ఈ తలంపు ఎక్కడ నుంచి వచ్చింది? ఈ కోరిక ఎక్కడ నుంచి వచ్చింది, నా కోరిక నేనే సృష్టించుకున్నాను. ఈ జన్మలో కాకపోతే గత జన్మలో నా వాసనని నేనే సృష్టించుకున్నాను. నా ఆదర్శాలు నేనే సృష్టించుకున్నాను. దానిని నేనే సృష్టించాను కాబట్టి దానిని నాశనం చేసే శక్తి నాలో ఉంది. పుస్తకాలలో ఏమి ఉంటుంది? ప్రతీ మనిషిని వాసన నడిపిస్తుంది. వాసన లేకుండా తలంపు రాదు. వాసన లేకపోతే ఆలోచన రాదు. అది రైటే ఈ వాసన ఎక్కడ నుంచి వచ్చింది? నా వాసనలు వేరు, నీ వాసనలు వేరు, మతానికి మతానికి తేడా, సమాజానికి సమాజానికి తేడా, తల్లికి బిడ్డకి తేడా, భార్యకి భర్తకి తేడా, ఒక మనిషికి ఇంకొక మనిషికి పోలిక లేదు. ఎంతమంది మనసులుఉంటే అన్ని వాసనలు, అన్ని ఊహలు, అన్ని తలంపులు, అన్ని కాంక్షలు. ఈ వాసనలు ఎక్కడ నుంచి వచ్చాయి? అందరూ సమానం అయితే మన వాసనలు సమానంగా ఉన్నాయా? మన శరీరాలు సమానంగా ఉన్నాయా? మన కోరికలు సమానంగా ఉన్నాయా? వాసనలు అన్నీ భిన్నంగా ఉన్నాయే, వాసన బట్టి మనిషి నడుస్తున్నాడు అని చెబుతున్నారు. ఏ మనిషి అయితే వాసన బట్టి నడుస్తున్నాడో, ఆ వాసనని సృష్టించింది కూడా ఆ మనిషే. ఏ మనిషి అయితే వాసనని సృష్టించుకున్నాడో, ఏ మనిషి అయితే వాసన కోసం జీవిస్తున్నాడో, ఆ మనిషే నిర్దాక్షిణ్యంగా, నిర్మోహమాటంగా, ఆ వాసనను బయటకు గెంటాలి, ఆ వాసనని నరకాలి. అప్పుడే వాడు జ్ఞాని అవుతాడు.

వైరాగ్యం అనే గొడ్డలి పెట్టుకుని ఈ సంసారం అనే వృక్షాన్ని, అజ్ఞానం అనే వృక్షాన్ని, అహంకారం అనే వృక్షాన్ని, నిర్దాక్షిణ్యంగా, నిర్మోహమాటంగా, దానిని నరుకు అప్పుడు కాని నువ్వు జ్ఞానివి కాలేవు అర్జునా అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఓ అరుణాచలేశ్వరుడా! నా మనసు బహిర్ముఖం అయిపోతోంది. ప్రతీ ఇంద్రియానికి సంతోషం కావాలి. ఏ ఇంద్రియం మటుకు ఆ ఇంద్రియం నా మనసుని లాక్కుపోతున్నాయి అరుణాచలేశ్వరుడా. అందుచేత ఈ మనసు అంతర్ముఖం అవ్వాలి అంటే, అది నా వల్ల అవుతుందా? నీ యొక్క గొప్పతనం ఈ మనసుకి చూపించు. అప్పుడు ఈ మనసు నీ వైపుకి ముఖం తిప్పుతుంది. నీ ప్రకాశాన్ని చూపించకపోతే నేను ఏమి అయిపోతాను అరుణాచల? నా గతి ఏమి అయిపోతుంది అరుణాచల? నన్ను కాపాడేవారు ఎవరు అరుణాచల? నా మీద నీకు దయ లేదా అరుణాచల? నీ ద్యుతిని చూపించు అరుణాచల. నన్ను గట్టెక్కించు అరుణాచల. అవతల ఒడ్డు నాకు కనిపించటం లేదు. అటువంటి అంధకారంలో ఉన్నాను. నీ ద్యుతి చూపించి

నప్పుడే, నీ తేజస్సు చూపించినప్పుడే, నీ ఆత్మ శక్తి చూపించినప్పుడే ఈ మనసు అనేది అణుగుతుంది కాని లేకపోతే అణిగే సమస్య లేదు. నా మనసు అణగటం కోసం అయినా, నా అహంకారం నిర్మూలించటం కోసం అయినా, నా అజ్ఞానం తొలగించటం కోసం అయినా, నీ ఆత్మ శక్తి, నీ brightness అంతా నాకు చూపించవయ్యా, చూపిస్తేనే కాని ఈ మనసు లొంగదు. నా మనసు లొంగటం కోసం నన్ను ఆత్మ శిఖరం మీద ఎక్కించటం కోసం, నీ యొక్క గొప్పతనాన్ని ఈ మనసుకి చూపించు. అప్పుడు కాని ఈ అల్పత్వాన్ని, ఈ స్వార్ధాన్ని, ఈ స్వల్పత్వాన్ని మనసు విడిచి పెట్టదు అరుణాచల.

నాకు ఉన్న చెడ్డ తలంపులు లోంచి, చెడ్డ వాసనలు లోంచి, చెడు కర్మల లోంచి, నా మనసు బయటకు రాదు. ఎప్పుడు బయటకు వస్తుంది అంటే, అరుణాచలేశ్వరుడు అంటే ఎంతటి వాడో ఈ మనసుకి అర్ధం అయితే, అప్పుడు మనసుకి ఉన్న అలవాట్లు అన్ని వదిలేసి నీ వెంట పడుతుంది. నా మనసుకి ఎన్నో జన్మల నుండి వాసనలు ఉన్నాయి. వాటిని విడిచిపెట్టి రమ్మంటే వస్తుందా? దైవానుగ్రహం కనుక లేకపోతే, చిన్న అలవాటు లోంచి కూడా మనం బయటకు రాలేము. అందుచేత నాకు ఉన్న దుష్ట వాసనలు లోంచి, దుష్ట సంకల్పాలు లోంచి, చెడు తలంపులు లోంచి, మానసిక ప్రలోభం నుంచి బయటకు రావాలి అంటే ఎన్నో జన్మల నుండి పెంచి పోషించుకుని వస్తున్నటువంటి, ఈ కోరికలు నుండి, ఈ వాసనలు నుండి బయట పడాలి అంటే నీ గొప్పతనం అర్ధం అయ్యేటట్లు దానికి చెప్పు. నీ గొప్పతనం తెలిసేటట్టు నీ ఔన్నత్యం దానికి చూపించు. నీ ప్రకాశాన్ని, నీ ఆత్మ యొక్క తేజస్సుని, నీ లోకాతీత వైభవాన్ని ఈ మనసుకి చూపించు. చూపిస్తే అప్పుడు అది లొంగుతుంది. ఎవడికి జ్ఞానం కలుగుతుంది అంటే జీవించి ఉండగానే ఎవడైతే మరణిస్తాడో వాడికి జ్ఞానం కలుగుతుంది.

ఓ స్వామి మనం చిన్నప్పుడు ఆడుకున్నాం, మనం చిన్నప్పుడు పరుగెత్తాం, అవి చేశాం, ఇవి చేశాం, అని రమణస్వామి తోటి తన చిన్ననాటి స్నేహితులు చెబుతుంటే, అప్పుడు భగవాన్ అన్నారట, నువ్వు ఎరిగిన వెంకట్రామన్ ఇక్కడ లేడు. నీతోటి చదువుకున్న

**నీ మీద నీకు విశ్వాసం లేనప్పుడు దేవుడు మీద విశ్వాసం ఉన్నా నువ్వు నాస్తికుడివే!**



వెంకట్రామన్, నీతోటి ఈతలు కొట్టిన వెంకట్రామన్, ఇక్కడ లేడు, వాడు చచ్చిపోయాడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో నీకు తెలియదు. ఒకవేళ నేను చెప్పినా నీకు అర్థం కాదు. ఒక జ్ఞానిని అర్థం చేసుకోవాలి అంటే వాడూ జ్ఞాని అయ్యి ఉండాలి. సోదరమహాశయులారా! జ్ఞానమే కాదు మీలో ఎవరికి అయినా ఒక గొప్ప గుణం ఉంటే, ఆ గొప్ప గుణం కూడా నాలో ఉంటే అర్థం అవుతుంది కాని లేకపోతే కొట్టుకు చచ్చినా అది నాకు అర్థం కాదు. ధ్యానం చేసినా, జపం చేసినా నాకు అర్థం కాదు. మీరు ఎక్కడో దేవుడు దాకా వెళ్ళకండి. ఎక్కడో మోక్షం దాకా వెళ్ళకండి. మీలో ఒక దైవీ గుణం, ఒక దైవీ సంపద, మీలో ఎవరికి అయినా ఉంటే, ఆ సంపద నాలో కనుక లేకపోతే, ఎన్ని సంవత్సరాలు మీతోటి స్నేహం చేసినా, ఎన్ని సార్లు మీ చుట్టూ తిరిగినప్పటికీ, మీరు ఎవరో నాకు తెలియదు, నాకు అర్థం కాదు. నేను ప్రయత్నం చేసినా అందుకోలేను. ఏదైనా గొప్ప క్వాలిటీ మీలో ఉన్నప్పుడు, అది నాలో ఉంటే దాని యొక్క వైభవం తెలుస్తుంది. అప్పుడు మీలో ఉన్న గొప్ప క్వాలిటీ చూసి నేను ఆనందించగలను. మీలో ఉన్నప్పటికీ, నాలో లేకపోతే అది నాకు కనపడదు. నేను ఆనందించలేను. మీ కూడా ఉన్నప్పటికీ దాని విలువ నాకు తెలియదు.

మనం అందరం భగవద్గీత రోజూ పారాయణ చేసేస్తున్నాం. భగవద్గీతలో భగవంతుడు చెప్పిన మాటలు ఎన్ని సార్లు చదివినా, ఆ మాటలు మనకు బుర్రకి ఎక్కవు, కళ్ళకి కనపడవు. మన బుర్రలో ఉన్నవి భగవద్గీతలో కనిపిస్తూ ఉంటాయి, జరిగేది ఇది. నేను చెప్పింది నిజమో, అబద్ధమో ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకోండి. ఏ పుస్తకం అయినా చదువు తుంటే, మన బుర్రలో ఉన్నవి అందులో కనిపిస్తూ ఉంటాయి. ఆ పుస్తకంలో ఉన్న మంచి మన బుర్రకి ఎక్కదు. అలా బుర్రకి ఎక్కి ఉంటే మనం ఏనాడో బాగుపడే వాళ్ళము. ఏవండీ కొంతమంది తపస్సులు అవి చేస్తారు కదూ, దేవుడు కనిపించి మీకు ఏమి కావాలో కోరుకో అంటే ఉన్నది ఏదో కోరుకుంటాడు. అయితే వాళ్ళు పుట్టినప్పుడు ఏదో ఒకటి రాసి ఉంటాడు కదా తలమీద, అది అంతా cancel చేసి కొత్తగా వీడు అడిగింది భగవంతుడు ఇస్తాడా? మీకు అర్థం అవుతుందా అండి ప్రశ్న? ఈ ప్రశ్నకి నేను సమాధానం చెప్పక్కర్లేదు. భగవాన్ చెప్పారు దానికి సమాధానం. భగవాన్ చెప్పిన సమాధానం ఏమిటి అంటే, వీడు ప్రారబ్ధంలో ఏమి ఉందో భగవంతుడిని అదే అడుగుతాడు, వీడి ప్రారబ్ధంలో డబ్బు ఉంది అనుకోండి, నాకు పైసలు కావాలి అని అడుగుతాడు. వీడి ప్రారబ్ధంలో అధికారం ఉంది అనుకోండి, అధికారం కావాలి అని అడుగుతాడు. వీడి దేహప్రారబ్ధంలో ఏదైతే ఉందో అదే దేవుడిని అడగాలి అనిపిస్తుంది, ఆయన ఇచ్చాను అంటాడు, జరిగేది అంతే.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।**
**నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః ॥05:19 ॥**

**తాత్పర్యం:** సర్వత్ర సమభావస్థిత మనస్కులు ఈ జన్మయందే సంపూర్ణ జగత్తును జయించిన వారగుదురు. అనగా - ప్రాపంచిక విషయాతీత స్థితికి చేరుదురు. సచ్చిదానంద ఘనపరమాత్మ దోషరహితుడు, సముడు. సమభావస్థిత మనస్కులైన జ్ఞానులు సచ్చిదానంద ఘనపరమాత్మ యందు స్థితులు. కనుక, వారు త్రిగుణాతీతులు. జీవన్ముక్తులు.

ఇహైవ తైర్జితః సర్గో - అంటే మీరు ఇక్కడే ప్రపంచాన్ని జయించాలి. శరీరానికి చావు రాకముందే, ఈ లోకంలో ఉండగా లోకానికి అతీతంగా వెళ్ళాలి. అంటే లోకంలో ఏ విషయాలు అయితే మిమ్మల్ని ఆకర్షిస్తున్నాయో, ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పడే వాటిని దాటాలి. ఇక్కడే లోకాన్ని జయించటం అంటే సంసారాన్ని జయించమని చెప్పకుండా చెపుతున్నాడు. ఇక్కడ సంసారం అనే మాట భగవంతుడు వాడటం లేదు కాని, లోకాన్ని జయించమంటే సంసారాన్ని జయించమని. చెప్పకుండా చెపుతున్నాడు స్వామి.

సర్గో యేషాం సామ్యే స్థితం మనః - సామ్యే స్థితం మనః - ఎవరి మనస్సు అయితే సమాన పరిస్థితిలో ఉందో, గాలిలేని చోట దీపం ఎలా ఉంటుందో, మనస్సు అంత బాలెన్స్‌డ్‌గా, బ్రెయిన్ అంత బాలెన్స్‌డ్‌గా, ఎవరికైతే ఉందో, ఎవరిదైతే బంగారం లాంటి మనస్సో, వాడికి మోక్షం వస్తుంది. రాగద్వేషాలు ఉంటే లోపలి నుంచి మనకి క్షోభ పుడుతుంది, అశాంతి పుడుతుంది. ఎవరికైతే రాగద్వేషాలు లేవో, అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా, ఎవరి మనస్సు అయితే నిర్మలంగా నిశ్చలంగా నిరాడంబరంగా ఉందో, ధనం వెంటాడినా దారిద్ర్యం వెంటాడినా, ఎవరి మనస్సు అయితే సమానస్థాయిలో ఉందో, వాడే బ్రహ్మమును పొందుతాడు అర్జునా! కబుర్ల వల్ల ఎవడూ పొందలేడు.

యేషాం సామ్యే స్థితం మనః - మనం అనుకూల పరిస్థితులలో ఒకరకంగా ఉంటాము, ప్రతికూల పరిస్థితులలో ఒకరకంగా ఉంటాము, మనకి అనుకూలమైన మాటలు


వింటే ఒకరకంగా ఉంటాము, మనకి ప్రతికూలమైన మాటలు వింటే ఒకరకంగా ఉంటాము. మనం పూర్వజన్మలలో చేసిన దాన్ని బట్టి మంచి ప్రారబ్ధం ఉంటే మంచి రావచ్చు, చెడ్డ ప్రారబ్ధం ఉంటే చెడ్డ రావచ్చు. ఏదైనా స్వప్నమే. అందుచేత ఆ రాగాద్వేషాలలో పుణ్యపాపాలలో ఇరుక్కోకుండా నీ మనస్సుని ఎప్పుడైతే సమానంగా బాలన్స్ చేసుకోగలుగుతున్నావో, నీ బుద్ధి ఎప్పుడైతే అన్ని పరిస్థితులలో క్వయట్‌గా కూల్‌గా ఉండగలుగుతోందో, అప్పుడు మాత్రమే బ్రహ్మమును పొందటానికి అది ఫిట్ అవుతుంది. ఊరికే మేము బ్రహ్మమును తెలుసుకోవటానికి వెళ్తాము అంటే వెళ్ళనివ్వరు. మన ఆడంబరము వల్ల ఎంటర్ అవ్వనివ్వరు అక్కడికి. ఆ మనిషికి ఆంతరంగిక జీవితం ఉందాలేదా, లోపల వాడికి సౌందర్యం ఉందా లేదా, అని ఈశ్వరుడు చూసుకుంటాడు.

ఇది కేవలం చదవటం వల్ల రాదు, లోపల జీర్ణం అవ్వాలి కదా. భగవంతుడు ఏ స్థాయిలో చెపుతున్నాడో అసలు ముందు పట్టుకోవాలి కదా. ఇంటలెక్చువల్ అండర్‌స్టాన్డింగ్ ముఖ్యం.

బ్రహ్మం 'నిర్దోషం హి సమం' - దానికి దోషాలు ఎలా ఉంటాయో తెలియదు, బలహీనతలు ఎలా ఉంటాయో తెలియదు, స్వపర బేధం తెలియదు. నువ్వు కూడా ఆ లోపాలు బలహీనతలు లేకుండా బ్రహ్మపదార్థము ఎలా ఉందో, అలా ఉంటే కదా దానిని పొందుతావు. అంటే ఏ కారణం వల్లనైనా మన మనస్సు బాహ్యాముఖం అవుతోంది అనుకోండి, బ్రహ్మమును పొందలేము. మన శరీరం చనిపోవటానికి వంద రోగాలు అక్కరలేదు, ఒక రోగం సరిపోతుంది. అలాగే మనకి ఒక్క బలహీనత ఉంటే ఆ బలహీనత వల్ల మనకి పునర్జన్మ వచ్చేస్తుంది కాని బ్రహ్మపదార్థాన్ని పొందలేము. ఆ స్థితిని పొందటం చాలా కష్టం. మన ప్రయత్నం సరిపోదు, ఈశ్వరుని దయ ఉండాలి, గురువు దయ ఉండాలి. ఇది డబ్బు సంపాదించినట్టు సంపాదించేది కాదు. ఈశ్వరుని దయ వల్ల లోపలినుంచి ఊరాలి జ్ఞానం. నాలో ఉన్న లోపాల లోనుంచి, నా బలహీనతల నుంచి నన్ను విడుదల చేసి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించు అరుణాచలేశ్వరుడా అంటున్నారు రమణస్వామి.

నీ లోపల ఉన్న బ్రహ్మపదార్థానికి దోషము లేదు, పాపము లేదు, స్వపర భేదబుద్ధి లేదు. అది సమానముగా ఉంటుంది. చీమల్లో దోమలలో ఏనుగులో ఎలా ఉంటుందో, సామాన్య మానవుడిలో కూడా అలానే ఉంటుంది. శరీరాలు తేడా కాని లోపల బ్రహ్మపదార్థము సమానముగా ఉంటుంది. దోషాలు ఏమీ లేకుండా, పరమపవిత్రంగా ఏకంగా ఏకాగ్రంగా పరిశుద్ధముగా స్ఫటికమువలె స్వచ్ఛముగా ఉండును. ఆ రకంగా నీ మనస్సుని నువ్వు తయారు చేసుకుంటే, ఆ రకంగా నీ మనస్సుకి క్రమశిక్షణ ఇస్తే నువ్వు దానిని పొందుతావు కాని లేకపోతే నీకు ఆ బ్రహ్మపదార్థాన్ని పొందే అవకాశము లేదు. బ్రహ్మపదార్థము ఎంత సమానముగా ఉందో, ఆ స్థాయికి నీ మనస్సు కూడా వస్తేనే నువ్వు దానిని పొందగలవు కాని, అదొక స్థాయిలో నువ్వొక స్థాయిలో ఉంటే దానిని పొందటం సాధ్యం కాదు.

తస్మాద్ బ్రహ్మణి తే స్థితాః - అటువంటి బంగారంలాంటి మనస్సు కలవారే బ్రహ్మములో స్థిరముగా ఉంటారు. వాళ్లకి తిరిగి పునర్జన్మ ఉండదు.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**శౌర్యము జూపితి శమియించెనని మాయ**
**చలియింప కున్నావు అరుణాచలా ।38।**

**తాత్పర్యము:** నీ శౌర్యము చూపించి, నా మాయను తొలిగించావు. మరి అంతటితో నీ పని పూర్తయ్యింది అనుకొంటున్నావా, అలా చలనం లేని అచల రూపమున నిలిచిపోయావు అరుణాచలా!

ఓ అరుణాచలేశ్వరుడా శౌర్యం చూపించావు. నీ పరాక్రమం చూపించావు. ఈ రమణమహర్షి అనే పెళ్లి కుమార్తెలో అజ్ఞానం పోగొట్టటం కోసం తన పరాక్రమాన్ని చూపించి, ఈ జీవుడు లోని జీవలక్షణాలను అజ్ఞానాన్ని పోగొట్టేసి, మాయని తొలిగించి ఏమి తెలియనట్లు కదలకుండా కూర్చున్నాడు. అరుణాచలేశ్వరుడు ఏమీ మాట్లాడటం లేదు అట!కదలటం లేదు, మెదలటం లేదు, కూర్చోమనటం లేదు, ఏమి అడగటం లేదు అటండీ! అరుణాచలేశ్వరుడు ఏమీ మాట్లాడడు అటండీ, మౌనంగా ఆయన చేయవలసిన పని నిర్మలంగా, మౌనంగా, సరళంగా, సహజంగా చేసి విడిచి పెట్టాడు.

అంటే తన అజ్ఞానాన్ని తనకి తెలియకుండా ఆపరేషన్ చేసి తీసేసాడు. ఆ ఆపరేషన్ ఎలా జరిగింది అంటే, నా ముఖం కూడా నలగనివ్వలేదు, అంత గొప్ప సర్జన్ అరుణాచలేశ్వరుడు అంటున్నాడు రమణస్వామి. బాధ అనేది ఏమి తెలియకుండా, ఆపరేషన్ చేస్తున్నట్లు పేషెంటుకే తెలియకుండా అంత నిర్మలంగా, అంత నిరాడంబరంగా నేను అజ్ఞానం తొలిగించాను అనేటువంటి విషయం కూడా ఈ రమణమహర్షి అనే పెళ్లి కుమార్తెకి తెలియకుండా అజ్ఞానాన్ని తీసేసాడు.

ఏమి శౌర్యం చూపించావు అరుణాచలేశ్వరుడా, ఏమి ధైర్యం చూపించావు, ఎంత నేర్పు చూపించావు అరుణాచలేశ్వరుడా! నాకు తెలియకుండానే నువ్వు నాకు ఆపరేషన్ చేసావు అంటే నువ్వు దేవుడివి కాబట్టి నీకు సాధ్యం అయ్యింది కాని అది మామూలు

మనిషికి సాధ్యం కాదు. నువ్వు నాలో ఉన్న మాయని తొలిగిస్తున్నావు అన్న సంగతి నాకు కూడా తెలియకుండా నాలో ఉన్న మాయని, నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలిగించేసావు. నాలో ఉన్న మాయ, నాలో ఉన్న అజ్ఞానం ఊరికే అకారణంగా పోయిందా? కాదు. నీ శౌర్యం చూపించావు. నీ విజ్ఞతని, నీ ప్రజ్ఞని చూపించావు. ఇదంతా చేస్తున్నాను అని నాతోటి చెప్పలేదు. ఆడంబరం లేకుండా, అది నువ్వు చేస్తున్నట్టుగానే కనిపించకుండా, నాలోని మాయని తొలిగిస్తున్నావు అన్న సంగతి నాకు కూడా తెలియకుండా మాయం చేసేసావు. చేసేవాడు ఎవడు పైకి కనపడడు. అరుణాచలేశ్వరుడికి మాటలతోటి ఏమి పని లేదు. మౌనంగానే ఉన్నాడు. ఆ చేసే ఉపకారం ఏమిటో కళ్ళకి కనపడనివ్వకుండా, మా మనస్సుకి కూడా తెలియకుండా నువ్వు చేసావు అరుణాచలేశ్వరుడా. మనకి ఏ బంధువు చేస్తాడు, ఏ స్నేహితుడు చేస్తాడు ఈ ఉపకారం? కొంతమంది చిన్న ఉపకారాలకి కూడా చాలా గొప్పలు చెప్పకుంటారు. కృష్ణుడు గోవర్ధన పర్వతం ఎత్తినా ఏమి తెలియనట్టే ఉంటాడు.

నువ్వు నన్ను శరణు వేడుకో, నన్ను నమ్ము, నన్ను విశ్వసించు, అని భగవంతుడు చెప్పటంలో ఉద్దేశం మనలని బాగుచెయ్యటానికే కాని మనలని బానిసలను చేయటానికి కాదు. ఓ అరుణాచలేశ్వరుడా, నా మాయని శమియింప చేసావు. నువ్వు నాకు చేస్తున్నటువంటి ఉపకారం చేస్తున్నట్టుగా కూడా కనిపించకుండా నా మాయని తీసేశావు. నా అజ్ఞానాన్ని తీసేశావు. చూసారా ఎంత ఉదారుడో దేవుడు! ఎవరు పొగడగలరు, మాటలతోటి ఎవరు చెప్పగలరు దేవుడి గురించి! నాకు ఇంత ఉపకారం చేసి కూడా కదలకుండా, మెదలకుండా ఉన్నావు అంటే, నీ ఔన్నత్యం ఎవరు చెప్పగలరు ఓ అరుణాచలేశ్వరుడా!


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# మహేంద్రనాథ్ గుప్త (M)

**(శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుంచి సేకరణ)**

మహేంద్రనాథ్ గుప్త అని ఒక హైస్కూల్ హెడ్ మాస్టర్ ఉండేవాడు. రామకృష్ణ పరమహంస ముఖ్య శిష్యులలో ఆయన ఒకరు. ఆయనని 'M' అని, మాస్టర్ మహాశయ అని కూడా పిలిచేవారు. ఆయన సంసారం పెద్దది; ఎప్పుడూ ఏదో గొడవలు ఉండేవి. బడిలో నుంచి ఇంటికి వచ్చేటప్పటికి ఈ బాధలు ఏమిటి అనుకునేవారు. కష్టపడి ఉదయం మొదలు సాయంత్రం దాకా హైస్కూలులో పాఠాలు చెప్పి ఇంటికి వస్తే మంచినీళ్ళు కావాలా అని అడిగేవాళ్ళు కాని, ఆప్యాయంగా పలకరించేవాళ్ళు కానీ లేరు. ఏదో దెబ్బలాటలతో మహేంద్రనాథ్ గుప్తకి ఇది ఇల్లా, నరకమా చచ్చిపోతే మంచిదేమో అనిపించేది. అటువంటి పరిస్థితులలో ఈ సఫరింగ్‌లోనుంచి ఎలా బయటపడటం అని తీవ్రమైన వేదన పడుతుంటే, ఎవరో రామకృష్ణ పరమహంస గురించి ఆయనకు చెప్పారు.

రామకృష్ణుడిని ఒకసారి వచ్చి చూసాడు, చూసిన వెంటనే అతని దుఃఖం అంతా ఆగిపోయింది. ఆయన ఎన్నో గ్రంథాలు చదివాడు, అయినప్పటికీ దుఃఖ వేదన నుంచి బయట పడలేకపోయాడు. రామకృష్ణుడిని చూసాక అతని దుఃఖం అంతా ఆరిపోయింది. రామకృష్ణుడు చెప్పిన మాటలన్నీ రాయటం కోసం మహేంద్రనాథ్ గుప్త ఈ లోకంలోకి వచ్చాడు. అందుకే అంత దుఃఖం అతనికి వచ్చింది. ఆ దుఃఖం వేదించి వేదించి రామకృష్ణుడి పాదాల దగ్గరికి తీసుకొచ్చింది.

రామకృష్ణుడి యొక్క నోటినుంచి వచ్చే మాటలు రాయటానికే పుట్టాడు మహేంద్రనాథ్ గుప్త. మీరు చెప్పే మాటలు నన్ను రాయమంటారా అని ఎవరైనా రామకృష్ణుడిని అడిగితే, M రాస్తున్నాడు కదా అనేవారు. వివేకానందుడు కూడా ఎప్పుడైనా రామకృష్ణుడి మాటలు రాయటానికి ప్రారంభిస్తే ఎప్పుడూ ఎంకరేజ్ చెయ్యలేదు. నువ్వు వేరే పని కోసం పుట్టావు రాయటం కోసం కాదు. నీ పని వేరే ఉంది, ఈ పని కోసం రాలేదు అనేవారు రామకృష్ణుడు.

శంకరాచార్యులు వారికి ఉన్న పాండిత్యం లేకపోయినా రామకృష్ణుడు కూడా బోధ స్వరూపుడు. రామకృష్ణుడు మిగతా శిష్యులెవరినీ కొంచెం అరికాళ్ళు నొక్కు అని అడిగేవారు కాదు. కాని మహేంద్రనాథ్ గుప్తని ఎప్పుడైనా అడిగేవారు. ఆ తాదాత్మ్యం ఉండేది రామకృష్ణుడికి మహేంద్రనాథ్ గుప్త తోటి. ఆయనే గోస్పెల్ రాసాడు.

మహేంద్రనాథ్ గుప్త ఇల్లు దూరం, ఎప్పుడైనా రాత్రి దక్షిణేశ్వరంలో ఉండిపోయేవాడు. ఇప్పుడు ఇంటికి వెళ్ళటం చాలా కష్టం అవుతుంది, ఈవేళ ఉండిపోతాను అంటే, నువ్వు నా గదిలో పడుకో అనేవాడు రామకృష్ణుడు. ఇంకా గదులు లేకకాదు, మహేంద్రనాథ్ గుప్తని మట్టుకు తన గదిలోనే పడుకోమనేవాడు. అంటే ఆయనకి ఆ తాదాత్మ్యం ఉండేది. రామకృష్ణుడు చెపుతావుంటే మహేంద్రనాథ్ గుప్త రాసేవాడు. మిగతావాళ్ళు ఎవరైనా రాయటానికి ప్రయత్నం చేస్తే మీరు ఊరుకోండి, అసలు ఈ హెడ్మాస్టారు పుట్టింది నేను చెప్పిన మాటలు రాయటానికే అనేవాడు రామకృష్ణుడు. అది పదిమంది చదువుకుంటారు అని రాయలేదు, కేవలం ఆయనకోసం రాసుకొన్నాడు. అదే గోస్పెల్ పేరుతో, కథామృతం పేరుతో ఇప్పుడు అందరికీ ఉపయోగపడుతోంది.

ఆయన శరీరం హైస్కూలులో ఉండేది, మనస్సు రామకృష్ణుడు దగ్గర ఉండేది. ఆయనకు రాముడు రామకృష్ణుడే, కృష్ణుడు రామకృష్ణుడే, దేవుడు రామకృష్ణుడే, గురువు రామకృష్ణుడే. ఆ తాదాప్యం అలా ఉండేది మహేంద్రనాథ్ గుప్తకి, కంప్లీట్ గా సరెండర్, పూర్తి శరణాగతి. వివేకనానంద వాళ్ళు అదేంటి ఇదేంటి అని ఏదో ప్రశ్నలు అడిగేవారు గురువుగారిని. ఈయన ఎప్పుడూ ప్రశ్నలు అడగలేదు. రామకృష్ణుడు ఏది చెపితే అదే యదార్థం, ఏది చెపితే అదే వేదం మహేంద్రనాథ్ గుప్తకి. ప్రశ్నించే సమస్య లేదు. అది కంప్లీటెస్ట్ సరెండర్ టు ది గురు, కంప్లీటెస్ట్ సరెండర్ టు ది విల్ అఫ్ గాడ్.

# మాస్టర్ మహాశయుడి భక్తి విశ్వాసాలు

**(రామకృష్ణుడి పట్ల మాస్టర్ మహాశయుడు Mకి ఉన్న భక్తివిశ్వాసాలను తెలియచేసే కొన్ని మాటలు)**

రామకృష్ణుడు పరమ పవిత్రుడు. ఆ శరీరం ఎంత పవిత్రంగా బ్రతికిందో నా కళ్ళతోటి నేను చూసాను. ఆయనతోటి నాకున్న అయిదు సంవత్సరాలు సహచర్యంలో నేనెప్పుడూ ఆయనలో పాపపు తలంపు చూడలేదు. ఆత్మవిద్యే కాకుండా లౌకిక జీవితంలో సుఖంగా బ్రతకటానికి కూడా అనేక మార్గాలు చెప్పాడు.

Mr. M నీకు ఒక మంచివాడు, ఒక చెడ్డవాడు కనిపిస్తే నువ్వు ముందు చెడ్డవాడికి నమస్కారం పెట్టు. ఎందుచేతంటే మంచివాడికి నువ్వు నమస్కారం పెట్టకపోయినా నీకేమీ అపకారం చెయ్యడు. చెడ్డవాడు నీకు అపకారం చేస్తాడు. ముందు వాడికి నమస్కారం పెట్టు. వాడు నీకు ఉపకారం చేస్తాడని కాదు, అపకారం చెయ్యకుండా ఉండటం కోసం అని రామకృష్ణుడు చెప్పారు. పులిలో దేవుడు ఉన్నాడు, పాములో దేవుడు ఉన్నాడు. అలాగని పాము దగ్గరికి వెళ్ళి, పులి దగ్గరికి వెళ్ళి మనం కూర్చోము. వాటికి దూరంగా ఉంటాము. అలాగే కొందరు మనుషులుగా కనిపిస్తారు కానీ పులి స్వభావం, పాము స్వభావం ఉంటుంది. వాళ్ళనేమీ అనొద్దు నువ్వు. వాళ్ళనేమీ విమర్శించకు. సాధ్యమైనంతవరకూ వాళ్ళకి దూరంగా జీవించు.

ఇటువంటి మాటలు, సాధనకి ఉపయోగ పడే మాటలు, లౌకికులు చేతిలో పడకుండా ఉండటం కోసం అనేక ఉపాయాలు చెప్పినటువంటి మహాత్ముడు, రామకృష్ణుడు. డిజైరబుల్ డిజైర్స్ (desirable desires) - కాశి వెళ్ళటం కోరికే అవ్వటానికి, కానీ ఆ కోరిక నిన్నేమీ బంధించదు అక్కడ అనేకమంది మహాత్ములు మహర్షులు సంచరించారు కాబట్టి అది దర్శనం చెయ్యటం మంచిదే. అది నిన్ను ఉద్ధరించే కోరిక, నిన్ను పవిత్రం చేసే కోరిక, నిన్ను బాగుపరిచే కోరిక. అటువంటి కోరికలు కోరుకున్నా అది పొరపాటు లేదు అని మా గురుదేవులు చెప్పారు అని M రాసాడు. మనం లోపల అనేక చెడ్డ కోరికలు పెట్టుకొని, కాశి వెళ్ళకూడదు అనే కోరికే కోరుకోము అంటే అర్థం ఏమిటి దానికి. అంచేత మనకున్న స్థాయిలో డిజైరబుల్ డిజైర్స్ ఉండవచ్చు.

రామకృష్ణుడు చివరి రోజులలో ఎక్కువ రామ నామం, కాళీ నామం చేసుకునేవాడు. చివరి రోజులలో కాన్సర్ వచ్చి శరీరం విడిచిపెడతాడు అనగా ఒకసారి M ని అడిగాడు. పూర్వం నీకళ్ళకి నేను ఎలా కనిపించాను ఇప్పుడు ఎలా కనిపిస్తున్నాను. పూర్వం మీ మనస్సు రాముడో కాళీయో ఏదో ఒక రూపం మీద ఉండేది, ఏదో ఒక నామం మీద ఉండేది. ఇప్పుడు మీరొక రూపాన్ని ఆరాదిస్తున్నట్టుగా అనిపించటం లేదు, అరూపంలోకి వెళ్ళిపోయారు. మీరొక నామాన్ని స్మరిస్తున్నట్టు కనపడటం లేదు, నామం లేని స్థితిలోకి వెళ్ళిపోయారు అన్నారు M. అప్పడు రామకృష్ణుడు “M ఎంత బాగా చెప్పావు నువ్వు” అన్నారు. ఒక నామం లేని స్థితిలోకి ఒక రూపం లేని స్థితిలోకి చేరుకొంటున్నాను అని నువ్వు చెపుతున్నావు. ఎంతబాగా చెప్పావు అన్నారు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# మహాశివరాత్రి

ప్రతీ సంవత్సరం మాఘమాసం కృష్ణపక్షం చతుర్దశి రోజున మహాశివరాత్రి పర్వదినాన్ని జరుపుకుంటాం. ప్రతినెలా వచ్చేది మాసశివరాత్రి, ఏడాదికి ఒకసారి వచ్చేది మహాశివరాత్రి. మహాశివరాత్రి అంటే అనంతుడు, అవ్యక్తుడు, నిరాకారమైన పరమాత్మ లింగరూపం ధరించిన రోజు. మన ఊహకి అందని, ఆద్యంత రహితమైన, జ్యోతి స్వరూపమే సదాశివుడు. 'శివుడు' అంటే మంగళప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు అని అర్థం. మన సంస్కృతిలో అనేక పండుగలు, పర్వదినాలు జరుపుకుంటాం. పండుగ అనగానే విందులు, వినోదాలు గుర్తుకొస్తాయి. కానీ మహాశివరాత్రి ఒక విభిన్నమైన పర్వదినం. కారణం ఆ రోజున శివునికి అభిషేకాలు చేస్తాం, ఉపవాసం చేస్తాం, జాగరణ చేస్తాం. "మనము 364 రోజులు భోగ దృష్టిలో ఉన్నా, లోకానికి దగ్గరగా ఉన్నా, కనీసం ఒక్కరోజు అయినా అనగా మహాశివరాత్రి రోజున అయినా 'యోగదృష్టి'లో ఉండండి" అన్నారు శ్రీనాన్నగారు. ఉపవాసము వల్ల శరీరానికి ఆరోగ్యము, శివ స్మరణ వల్ల మనస్సుకి ఆరోగ్యమూ చేకూరుతుంది. విశ్వమంతా సాక్షాత్తు శివ స్వరూపమే. అష్టమూర్తులు అనగా జీవకోటి, నక్షత్రములు, గ్రహాలు, పంచభూతాలు మొదలైనవన్నీ వేటికవి వేరు వేరుగా కనబడుతున్నప్పటికీ ఇవన్నీ విశ్వంలో అంతర్భాగాలే! అన్నిటికీ ఆధారంగా ఉన్న చైతన్యస్వరూపం ఒక్కటే. ఆ చైతన్యమే పరమశివుడు. సకల చరాచర జగత్తు పరమశివునిలోనిదే, శివస్వరూపమే! సముద్రం ఒక్కటే అయినప్పటికీ అందులోంచి ఎన్నో అలలు వస్తుంటాయి కానీ ఆ అలలన్నిటికీ మూలము సముద్రమే కదా! అలలన్నింటికీ సముద్రం ఎలా మూలం అయిందో, ఈ సమస్త విశ్వములోని సకల నామ, రూపాలకు, సకల ప్రాణికోటికి మూలం అయిన వాడు పరమ శివుడు. అందుకే ఆయనను విశ్వనాధుడు అన్నారు. ఏవిధముగా జ్యోతికి, అది ప్రసరింపజేసే కాంతికి, భేదము ఉండదో, అదేవిధముగా విశ్వానికి, విశ్వనాధునికి భేదము లేదు. దేహాత్మబుద్ధి నుండి విడుదల పొంది, ఆత్మజ్ఞానంలోకి మేల్కొవడమే శివరాత్రి జాగరణలోని పరమార్థం. అహంకార, మమకార రూపంలో ఉన్న దేహాభిమానం నశించకుండా ఆత్మజ్ఞానం కలగదు. మహాశివరాత్రి పర్వదినాన చించినాడ గ్రామంలో సద్గురువు శ్రీనాన్నగారి ప్రవచనాలు శ్రవణం చేసిన భాగ్యం మనందరికీ కలిగింది. అది మన జన్మాంతర సుకృతం. శివుడు వేరు, గురువు వేరు కాదు. అందుకే 'శివాయ గురవే నమః' అని అంటారు. శివానుగ్రహం కలిగిన వారికి శివుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. మనము పరిపూర్ణ 'శరణాగతి' చెందినప్పుడే ఆయన 'అనుగ్రహం' మనకు అనుభవైకవేద్యం అవుతుంది.

**(ది 18-02-2023 మహాశివరాత్రి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ఆదర్శ శ్రీమతికి అక్షర బహుమతి

"గోభిర్విప్రై వేదైశ్చ సతిభిః సత్యవాదిభిః అలుబ్దైర్ధాన శీవైశ్చ సప్తభిర్ధార్యతే మహీ" అని వేదం చెబుతున్నది. అర్థం "గోవులు, విప్రులు, వేదాలు, పతివ్రతలు, సత్యవ్రతులు, లోభరహితులు, దానశీలురు ఈ ఏడుగురిచేత ఈ లోకం ఉద్ధరింపబడుతున్నది" అని.

సంయమనం, సంతుష్టి, తపస్సు, త్యాగం, శౌచం, శాస్త్రనిష్ఠ, జ్ఞానవిజ్ఞానాలు ఇవే బ్రాహ్మణ ధర్మం. మూర్తీభవించిన బ్రహ్మణత్వమే బ్రహ్మసూత్ర వ్యాఖ్యాత వాచస్పతి మిశ్రమహోదయులు గురుకులంలో విద్యాధ్యయనం ముగించుకొని గృహానికి వచ్చిన ఆయనకు తల్లితండ్రులు వివాహం చేసారు. కానీ వాచస్పతి పండితునికి తనకు వివాహమైనదన్న స్పృహే లేదు. నిరంతరం శాస్త్రాధ్యయనం, చింతన మననాలు గ్రంథలేఖనం ఇవి తప్ప మరొక ధ్యాసే ఉండేది కాదు. ఇలాంటి సందర్భం భాగవతంలో కపిల చరిత్రలో కనిపిస్తున్నది. కర్దముడు వివాహమాడాడే కానీ బ్రహ్మచారి వలెనే ప్రవర్తించారు. భార్య దేవహూతిపట్ల దృష్టే పెట్టలేదు. ఎంతసేపటికీ తన తపస్సు, సాధన గృహస్థ ధర్మం తెలియక కాదుగా. ఈ ఉపేక్ష భగవంతునికి తల్లికావడానికి దేవహూతి కూడా సాధన చెయ్యాలి కదా! ఆమెకు తితిక్షా సంయమన పరీక్ష. ఇది బుద్ధిపూర్వకం కానీ వాచస్పతులవారిది అసంకల్పితం. సహజ అమనస్కక యోగం. చిత్తైకాగ్ర అంత శుభం కాదు. చిత్తమాలిన్యం తొలిగితేనే అది సాధ్యం. ఏకాగ్రత సిద్ధిస్తేనే వద్యస్తు జ్ఞాన ప్రాప్తి. అన్నపానాల మీదే ధ్యాస లేని వానికి ఇతర కర్మల గురించి యోచించే సమయం ఎక్కడ? అయినా శరీర ధర్మాలనేవి ఉంటాయి కదా! శరీరం యంత్రంలాగా ఆయా సమయానికి అలవాటు ప్రకారం అన్ని పనులు చేసుకుపోతుంది కానీ ఆయన మనసు మాత్రం లక్ష్య సాధనకే అంకితమైంది. 'కావ్య శాస్త్ర వినోదేన కాలోగచ్ఛతి ధీమతాం' బుద్ధిమంతులు కావ్య శాస్త్ర వినోదాలతోనే కాలం గడుపుతారు కదా!

ఒకనాటి పవిత్ర రాత్రి పండితులవారు భాష్య రచనా వ్యాసంగంలో నిమగ్నమై ఉన్నారు. ఆయన చుట్టూ అనేక తాళపత్ర గ్రంథాలు, మధ్యమధ్యలో అవసరమైన గ్రంథ పరిశీలనం చేస్తున్నారు. ఇంతలో అకస్మాత్తుగా ఆముదపు దీపం ఆరిపోయింది. అధ్యయనంలో అంతరాయం వలన ధ్యానం చెదిరింది. అంతలోనే అర్థాంగి వచ్చి దీపం వెలిగించి వెళుతూండగా పండితుల వారు గమనించి ఆశ్చర్యంగా "దేవీ మీరు ఎవరు?" అని అడిగారు. ఆమె సిగ్గుతో తలవంచి వినయ వినమ్రంగా .............

**(మిగతా వచ్చే సంచికలో....)**

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**